సంపుటి 55 సంచిక 134 జనవరి 2021

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



విశ్వాసమే బలం, బలహీనతయే మరణం

విషయ సూచిక

**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**........................................................................................1

సెక్రెటరీ రిపోర్ట్ – **అపర్ణ సుసర్ల.....** ..........................................................................................................2

## శీర్షికలు

శ్రీమద్భగవద్గీత – రంగారావు పెయ్యేటి ..........................................................................................4

**సంక్రాంతి** - లలిత రాంభట్ల ..........................................................................................................9

ముగ్గులు -అనురాధ నేదునూరి..........................................................................................................11

రంగవల్లులు -శ్రీదేవి పెయ్యేటి...........................................................................................................12

యూరో ఫైటర్ టైఫూన్ - మూర్తి జొన్నలగెడ్డ...................................................................................13

వృద్ధబాలుణ్ణి నేను-కీ.శే.శ్రీ గండికోట విశ్వనాధం ................................................................................15

శుభాభినందనలు!-విజయ చావలి ....................,..................................................................................16

గజల్ - వ్యక్తిత్వ వికాసం - కె.టి.పద్మజ..............................................................................................17

కూనలమ్మ పదాలు - ఎస్.ఆర్.ఎస్. కొల్లూరి ........................................................................................22

నేను - రంగారావు పెయ్యేటి................................................................................................................26

అమెరి"కరోనా కకావికలం' కథ - చిట్టెన్ రాజు వంగూరి.................................................................27

రచనలలో సందర్భోచిత పదప్రయోగం -విజయ గొల్లపూడి.........................................................30

సంగీతనాదామృతం-పద్మ మల్లెల......................................................................................................35

చిత్రకళ- ప్రసూన రవీంద్రన్..................................................................................................................41

మహిమ – డి. కామేశ్వరి........................................................................................................................43

నవ్వు, నవ్వించు- సాయి గొల్లపూడి....................................................................................................53

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | కో-ఆర్డినేటర్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | ప్రసాద్ రాంబొట్ల |

# సంపాదకీయం

తెలుగు వాహిని ప్రియ పాఠకులకు ఆంగ్లనూతన సంవత్సర శుభాకాంక్షలతో జనవరి మాస సంచికను అందిస్తున్నాం. ఈ నెలలో భారతీయ సనాతన ధర్మాన్ని, హైందవ సంప్రదాయాలను పాశ్చాత్యులకు చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద జయంతి జనవరి 12వ తేదీ సందర్భంగా వారి ముఖచిత్రంతో, మరియు స్ఫూర్తిదాయక సూక్తులతో తెలుగు వాహిని అందిస్తున్నాము.మొదటి నెలలో క్యాలెండర్ మరియు డైరీల అమ్మకం జోరుగా సాగుతుంది. రాబోయే రోజులకు ప్రణాళికలు రూపొందించి, అమలుపరుచుకోవడానికి ఇవి మంచి సాధనాలు. అంతేకాక దైనందిన జీవితంలో కొన్ని ముఖ్య సంఘటనలు గుర్తుపెట్టుకోవాలంటే డైరీ బాగా ఉపయోగపడుతుంది.
సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా కలము, కాగితము విలువను మాత్రం తగ్గించవు. పెన్ను చేతబడితే బ్రెయిన్ లో ఉవ్వెత్తున ఎగిసిపడే అలలకు కొంత ఊరట కలిగి కార్యాచరణరూపం దాల్చటానికి మార్గం సుగమమవుతుంది. రోజు గడవగానే నిన్న ఏమి జరిగిందో సగటు మనిషి చెప్పలేని పరిస్థితిలో, రాయడం అనే చక్కని అలవాటు వదులుకోకుంటే మతిమరుపు వయస్సు మీరినా దరిచేరదు అని భరోసా ఏర్పడుతుంది.
కరోనా బూచి దేశమంతా ప్రాకకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తతతో ఆస్ట్రేలియా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బహు ప్రశంసనీయం. పౌరులుగా రోజువారి సమాచారాన్ని తెలుసుకుంటూ ప్రతి ఒక్కరు తమవంతు సహకారాన్ని అందిస్తే మళ్ళీ పరిస్థితులు చక్కబడతాయి.
తెలుగువారి ముఖ్యమైన పండుగ సంక్రాంతి. అరిసెలు, పిండివంటలు, బొమ్మల కొలువులు, గొబ్బిళ్ళు, ధనుర్మాసంలో విష్ణుసహస్రనామాలు, ముగ్గులు మన తెలుగుతనానికి ప్రతీకలు. ఎక్కడ ఉన్నా మనం తెలుగువారము. తెలుగువారందరి ప్రతి ఇంట రాబోవు సంక్రాంతి వెలుగులను విరజిమ్మాలని ఆకాంక్షిస్తూ.....

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ కుమార్ పరసు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


తెలుగు వాణి కన్వీనర్ :
రాజా తల్లాప్రగడ
0422 953 668


తెలుగు వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు బడి కోఆర్డినేటర్
రావు పెద్దాడ 0456 226 000


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## ఆఫీసర్స్


మూర్తి పోతుకూచి-రిటర్నింగ్ ఆఫీసర్


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

Happy New Year and Welcome to 2021!

2020 has been a crazy year. The challenges and obstacles faced and then overcome by our community is nothing short of astounding! It has presented us with many personal and professional challenges but also opportunities for creative interactions with the members.
A big shout out to all our volunteers – Telugu Badi Teachers, Telugu Badi Sub-Committee members, Telugu Vani Broadcasters, Telugu Vani Sub-Committee members, Telugu Vahini contributors, Telugu Vahini Sub-Committee members, Telugu Vanitha Co-Ordinators, Telugu Vanitha Sub Committee members, STA website contributors, Web Developers, and administrators. Thank You to Telugu Seniors Sub-Committee members, Public Officer, Auditor, Returning Officer, UAI representatives, FTAA representatives and PFC members for their continued support.

All the volunteers have adapted to the technology and new way of working and ensured that all the weekly activities are delivered as per schedule. The previous and current Executive Committees have shown enormous resilience, commitment, and dedication in serving the community.

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- Telugu Badi Sub-Committee are working through the holiday season to get Badi operations streamlined for 2021 academic year. Enrolments for 2021 are now open and enrolment forms are available on http://sydneytelugubadi.org/schools/enrolment-form

- New Telugu Vani Committee has taken charge and have commissioned a new facebook page - https://www.facebook.com/STAteluguvani

- Vanitha Mandali organised a virtual Home Gardening information session on 5TH Dec 2020. The event was informative and well attended with over 40 households virtually joining the session,

- EC is working closely with Public Officer Dr. Ravi Seethamraju and seeking his advice and guidance on governance and compliance changes.

- Sri Prasad Rambhotla has been appointed as Vahini Co-ordinator to work with Smt. Vijaya Gollapudi in the Vahini Sub-Committee.

The EC is undertaking a major initiative to drive youth participation and involvement within the association. As a first step, we are gathering and collecting information about your children, their interests, and skillsets. This information is useful to tailor STA events and communications to our children and their interests. Soon you will be receiving an email to register your children details.

Planning is underway for our 2021 flagship Ugadi event and the program details will be shared in February 2021.

We are grateful to all our sponsors for the continued support during this pandemic year and looking forward to the same support in future.

The Executive Team wishes all members, volunteers and business sponsors a happy new year. We are excited to continue working with you all to take our Sydney Telugu Association to next level in 2021!

I trust that 2021 will be a good year for you personally and professionally and that the spirit of telugu language, culture and arts promoted by the STA will continue to flourish in Australia.

Best Regards,
Aparna Susarla, Secretary Sydney Telugu Association.

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

16.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః |

ఉభయోరపి దృష్టోఽంతః త్వనయోస్తత్త్వదర్శిభిః || 16 ||

అసతః = అసద్వస్తువునకు (లేనిదానికి)

భావః = ఉనికి

న విద్యతే = లేదు

తు = ఐతే

సతః = సద్వస్తువునకు (ఉన్నదానికి)

అభావః = లేమి (లేకుండుట)

న, విద్యతే = లేదు

అనయోః ఉభయోః అపి = ఈ రెండింటి యొక్కయు

అంతః = తత్త్వము

తత్త్వదర్శిభిః = తత్త్వజ్ఞానుల చేత

దృష్టః = చూడబడినది. (తెలుసుకొనబడినది)

అనిత్యమైన దానికి ఉనికియే లేదు. సత్తు అనుదానికి లేమి లేదు. ఈ విధముగ ఈ రెండింటియొక్క వాస్తవరూపములను తత్త్వజ్ఞానియైనవాడే గ్రహించును.

ఉన్న ఆత్మను లేదనుకోవడం వలన (కనపడని పరమాత్మ మిథ్య అనుకోవడం వలన) సంతోషానికి దూరమవుతున్నారు. అలాగే మిథ్య అయిన జగత్తు ఉన్నదనుకోవడం వలన (భౌతికంగా గోచరమవుతున్న దానినే సత్యము, శాశ్వతము అనుకోవడం వలన) దుఃఖం కలుగుతున్నది. (బ్రహ్మ సత్యం, జగన్మిథ్య)కనబడేది లేదనుకోవాలా? కనబడనిదానిని ఉన్నదనుకోవాలా? విచిత్రంగా వున్నది కదూ? అవును. ఇందులోని నిజాన్ని తత్త్వాన్ని దర్శించిన వారే గ్రహించగలరు. ఒకనికి కల వచ్చింది. ఆ కలలో అతడు కొండ మీద నుంచి ముళ్ళకంపలో పడిపోయాడు. ఒళ్ళంతా ముళ్ళు గుచ్చుకుని రక్తం కారుతోంది. బాగా నెప్పి పెడుతోంది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఇంతలో అతడి భార్య అతడిని మేల్కొలిపింది. 'ఏమండీ! ఏదో పలవరిస్తున్నారేమిటీ?' అని అడిగింది. అతడు కళ్ళు తెరిచి చూసాడు. జాగ్రదవస్థలోనికి వచ్చాడు. అతడికి ముళ్ళేమీ గుచ్చుకోలేదు. రక్తం రావటల్లేదు. బాధగా లేదు. 'ఇదేమిటి? ఇదంతా కలా?' అని ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు ఏది నిజమనుకోవాలి? ఏది మిథ్య అనుకోవాలి? నిద్రలో వుండగా అతడు కొండ మీదనుంచి నిజంగానే పడిపోయాడే! ముళ్ళు గుచ్చుకున్నాయే, రక్తం వచ్చిందే? బాధననుభవించినాడే? క్షణం క్రితం అనుభవించిన ఆ బాధంతా మేల్కొగానే ఎలా మాయమయి పోయింది? లేదు, లేదు, నేను నిజంగానే బాధను అనుభవించాను అని అతడు వాదిస్తే అతడు తత్త్వవాది అవుతాడు. ఓహో! ఇదంతా భ్రమే సుమా? ఇదంతా మిథ్య సుమా అని తెలుసుకొన్నవాడు తత్త్వదర్శి అవుతాడు. కాలక్రమాన నశించేవాటి గురించి బాధనొందేవాడు తత్త్వవాది. శోకింపదగని వాని గురించి శోకింపగూడదు అని తెలుసుకున్నవాడు తత్త్వదర్శి. అందువల్లనే భౌతికంగా కలిగే సుఖదుఃఖాలను, శీతోష్ణాలను సమభావంతో, సహనంతో భరించాలి అని పరమాత్మ బోధిస్తున్నాడు.

'వస్తా వట్టిదే పోతా వట్టిదే, ఆశ ఎందుకంటా? చేసిన కర్మము చెడని పదార్థము చేరును నీ వెంట!'

17.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ |
వినాశమవ్యయస్యాస్య నకశ్చిత్కర్తుమర్హతి || 17 ||

ఇదం సర్వమ్ = ఈ సమస్త ప్రపంచమున్ను

యేన = దేనిచేత (ఏ పరమాత్మ చేత)

తతమ్ = వ్యాపించబడి యున్నదో,

తత్ తు = దానిని

అవినాశి = నాశము లేనిదిగా

విద్ధి = ఎఱుంగుము.

అస్య = ఈ

అవ్యయస్య = నశింపని పదార్థమునకు

వినాశమ్ = నాశమును

కర్తుమ్ = కలుగజేయుటకు

కశ్చిత్ = ఎవడును

న అర్హతి = తగడు.

ఓ అర్జునా! ఈ సమస్త ప్రపంచమున్ను ఏ పరమాత్మ చేత వ్యాపింపబడి యున్నదో, అది నాశరహితమై యున్నదని యెఱుంగుము. అవ్యయమగు అట్టి ఆత్మకు వినాశము నెవడును కలుగజేయ జాలడు.

సర్వజీవులు ఆత్మస్వరూపాలే అని తెలుసుకోవాలి. వాని యెడల ప్రేమ, దయ, కరుణ కలిగి వుండాలి. ఏ సమయంలోను పాపచింతన కలిగియుండ రాదు. సర్వవ్యాపియైన ఆత్మయే మనలోను వున్నది. దానిని ఎవరూ నాశనము చేయలేరు.

18.

అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః |

అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత !! 18 ||

నిత్యస్య = నిత్యుడును,

అనాశినః = నాశనము లేనివాడును,

అప్రమేయస్య = ప్రత్యక్షాది ప్రమాణములచే తెలిసికొనబడని వాడును అగు

శరీరిణః = దేహియైన ఆత్మయొక్క

ఇమే దేహాః = ఈ శరీరములు

అన్తవన్తః = వినాశము కలవిగా

ఉక్తాః = చెప్పబడినవి

తస్మాత్ = ఆ కారణము వలన

భారత = ఓ అర్జునా!

యుధ్యస్వ = యుద్ధము చేయుము.

ఓ అర్జునా! నిత్యుడును, నాశరహితుడును, అప్రమేయుడును అగు దేహి (ఆత్మ) యొక్క ఈ దేహములు నాశవంతములుగ జెప్పబడినవి. కాబట్టి (ఆత్మను గూర్చి కాని, దేహమును గూర్చి కాని శోకమును వదలి) నీవు యుద్ధము చేయుము.

ఓ అర్జునా! ఈ ఆత్మ అనగా దేహి వివిధ దేహాలను ధరిస్తూ వుంటుంది. ఆ దేహాలు నశ్వరమైనవి, అనగా నాశనము చెందేవి. ఇంక ఆత్మ అంటావా, అది నిత్యమైనది, శాశ్వతమైనది, నాశనము లేనిది. అందువలన నీవు దేహము గురించి గాని, ఆత్మ గురించి గాని చింతనొందుట మాని, నీ కర్తవ్యమైన యుద్ధాన్ని చెయ్యి.

నిత్యస్య అన్నా అనాశినః అన్నా నాశరహితమైనదనే అర్థము. మరి రెండుసార్లు ఎందుకు ప్రయోగించవలసి వచ్చింది? నాశము రెండు విధములు. దేహము భస్మీభూతమైనపుడు నిరవశేష నాశము పొందుతుంది. అంటే ఇంక ఏమీ మిగలకుండా పూర్తిగా నాశనమై పోతుంది. రోగాదులచేత దేహము చిక్కినప్పుడు దేహము నష్టమైనదని చెప్పబడుతుంది. అది సావశేష నాశనము. అంటే దేహం కొంచెం మిగిలి ప్రాణావశిష్టమై వుంటుంది. అందుచేత ఆత్మ సావశేషనాశము గాని, నిరవశేషనాశము గాని లేనిది అని చెప్పబడింది.

అప్రమేయస్య = ప్రత్యక్షానుమానోపమానశబ్దాది ప్రమాణములచే దెలిసికొనుటకు వీలు కానిది ఆత్మ. ఎట్లనిన లోకమునందు శబ్దస్పర్శరూపరసగంధములలో నేదైన నొకటి గల వస్తువు ప్రత్యక్షప్రమాణములగు నింద్రియములచే దెలిసికొనదగును. కాని ఆత్మ 'అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథాఽరసం నిత్యమగంధవత్' అన్న శ్రుత్యుక్తరీతిని శబ్దాదివిహీనమగుటచే బ్రత్యక్ష ప్రమాణముచే దెలియబడదు. అట్లే 'నైనచ తస్య లింగః' అను శ్రుతి ననుసరించి యాత్మనూహించుటకు దగు హేతువేదియు లేనందున ననుమాన ప్రమాణముచే గూడ తెలిసికొనుటకు వీలు లేదు. అట్లే 'యత్తదద్రేశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణం' అను శ్రుత్యుక్తరీతిని నామరూపజాత్యాది విహీనమగుటం జేసి యాత్మ నామరూప జాతిక్రియా పురస్సరముగ వస్తువును బోధించు శబ్దమువలన గూడ దెలియబడదు. ఏ ప్రమాణము చేతను కూడా ఆత్మ తెలియబడదు కాబట్టి ఆత్మను అప్రమేయము అన్నారు.

శరీరిణః అని పరమాత్మ ఏకవచనం ప్రయోగించాడు. అంటే బ్రహ్మ మొదలు స్తంబ పర్యంతమగు శరీరములెవని కుపలబ్ధి స్థానములుగ గలవో అట్టి సర్వప్రాణ శరీరోపాధికుడగు నాత్మ యొక్కటియే అని తెలియుచున్నది. కాని ఆత్మ ధరించిన భీష్మ ద్రోణాది సకల శరీరములు, అంతవంత ఇమే దేహాః, ఈ దేహాలన్నీ నాశమునొందేవే. అలా నశించిపోయే దేహాల మీద మమకారాన్ని పెంచుకుని నీ క్షాత్రధర్మాన్ని నువ్వు నిర్వర్తించక పోవడం ఉచితం కాదు అర్జునా అని పరమాత్మ బోధిస్తున్నాడు.

19.

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ |

ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే || 19 ||

యః = ఎవడు,

ఏనమ్ = ఈ (శరీరమందలి) ఆత్మను

హన్తారమ్ = చంపువానినిగ

వేత్తి = తెలిసికొనుచున్నాడో

యశ్చ = ఎవడు

ఏనమ్ = వీనిని

హతమ్ = చంపబడినవానినిగ

మన్యతే = తలంచునో

తౌ ఉభౌ = ఆ ఇద్దరును

న విజానీతః = తెలిసినవారు కారు

అయమ్ = ఈ ఆత్మ

న హన్తి = చంపుట లేదు

న హన్యతే చ = చంపబడుటయు లేదు.

ఎవడు ఈ ఆత్మను చంపువానినిగ తలచునో, లేక ఎవడు చంపబడువానినిగ భావించునో, వారిరువురును వాస్తవము తెలిసిన వారు కారు.యథార్థమునకు ఈ యాత్మ దేనిని చంపుట లేదు, దేనిచేతను చంపబడుట లేదు.

ఆత్మ చంపువాడు కాదు అని చెప్పుట వలన కర్తృత్వాదులాత్మకు లేవని తెలియుచున్నది. ఆత్మ చేయువాడు కాని, చేయించువాడు కాని కాదు. కర్తృత్వాదులు బుద్ధికే గాని, బుద్ధికి సాక్షియగు ఆత్మకు గావు. ఆత్మకు కర్తృత్వమాపాదించుట వెఱ్ఱిదనము.

ఆత్మ చంపబడువాడు కాదు. ఆత్మ శాశ్వతుడు, నిర్వికారుడు. మరణము దేహమునకే గాని ఆత్మకు కాదు. ఆత్మ దేహసాక్షియై, నిత్యనిరంజనుడై వెలుగొందుచుండును.

20.

న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః

అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ||20 ||

అయమ్ = ఈ ఆత్మ

కదాచిత్ = ఎప్పుడును

న జాయతే = పుట్టుట లేదు

న మ్రియతే వా = చచ్చుటయును లేదు

న భూత్వా = ఇదివరకు లేకుండి

భూయః = మరల

భవితా వా న = (క్రొత్తగా) కలుగువాడును కాదు (లేక), (ఉండి మరల లేకుండు వాడు కాదు)

అయమ్ = ఇతడు

అజః = పుట్టుక లేనివాడు

నిత్యః = ఎల్లప్పుడు వుండువాడు

శాశ్వతః = మరణము లేనివాడు, శాశ్వతుడు

పురాణః = అనాదియైనవాడు

శరీరే హన్యమానే = శరీరము చంపబడినను

న హన్యతే = చంపబడుట లేదు.

ఈ ఆత్మ ఎప్పుడును పుట్టుట లేదు, చచ్చుటనూ లేదు. ఇదివఱకు లేకపోయినది కాదు. ఇప్పుడు క్రొత్తగా వచ్చినది కాదు. ఇతడు జనన మరణములు లేనివాడు. శాశ్వతుడు, అనాదిగా నిలచియున్నవాడు. దేహము నశించినను ఇతడు నశించుట లేదు.

మానవుడు ఎప్పుడైతే నశించిపోయే ఈ దేహాన్ని నేను కాదు, దీనికి వేఱుగా వున్న ఆత్మను నేను అన్న నిజాన్ని గ్రహించి తత్త్వదర్శి కాగలడో అప్పుడు అతడికి ధైర్యము, ఆనందము కలుగుతాయి. మరణభయాన్ని పొందడు.

జాయతే, అస్తి, వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, నశ్యతి - ఈ షడ్భావ వికారాలు లేనిది ఆత్మ.


ఓం నమో భగవతే వాసుదేవాయ!

❖❖❖❖❖



# సంక్రాంతి

-శ్రీమతి. లలిత రాంభట్ల, హైద్రాబాద్



తెలుగువారి సంక్రాంతి, మూడు రోజుల పండుగ. భోగి, మకర సంక్రాంతి తరువాతిరోజు కనుమ పండగ. వాడుకలో కనుమ పండుగగా స్థిరపడినప్పటికీ దీని అసలు పేరు **'కనుము పులు'** పండగ. **కనుము** అంటే పశువు అని అర్థం, **పులు** అంటే రత్నాలపై పెరుకునే మాలిన్యం,అల్పమైనది, కసవు అర్థాలున్నాయి, కసవు అంటే గడ్డి, కనుము పండుగనాడు పశువులకు కనీసం గడ్డిని వేసి తినిపించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. అందుకే ఈ **పండుగకు 'కనుము పులు'** పర్వం అని పిలిచారు. కృషి వ్యవస్థకు మూలాధారమైన పశువులకు కృతజ్ఞతలు చెల్లించుకునే పర్వంగా కనుమ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంప్రదాయం.

పరోపకారమె ధ్యేయముగా గల మూగజీవులను గౌరవించడానికి ఏర్పాటుచేసిన సంప్రదాయం కనుమ. ప్రపంచమంత భగవత్ స్వరూపంగా భావనతో కనుమ రోజున విశిష్ఠంగా రైతన్నలు జరుపుకునే పండుగ. సిరిసంపదనిచ్చే గోమాతను, బసవన్నను పూజించే పండగ. మూగజీవుల పట్ల ప్రేమను తెల్పుతు కనుమనాడు రైతులు పశుశాలను శుభ్రపరిచి పశువులను శుభ్రంగా కడుగుతారు, పశువులకు పసుపు పూసి, కుంకుమబొట్లు పెడతారు. మెడలో గంటలు, గవ్వలు కడతారు. కొమ్ములకు వెండి తొడుగులు కాళ్ళకు గజ్జలు తొడుగుతారు పూలమాలలు వేసి పూజిస్తారు. ఆ తర్వాత పశువులన్నిటికి పచ్చగడ్డి, సెనగపిండి పొంగళ్లను దాణాగా తినిపిస్తారు. వ్యవసాయదారులు పశువులను మేళతాళాలతో ఊరంతా తిప్పుతారు. కనుమానాడు గోవును పూజించడంవల్ల అనంతమైన పుణ్యఫలం పొందుతారని శాస్త్రం. సంతానానికి గోవు సంకేతం, ధర్మానికి ఎద్దు సంకేతంగా భావిస్తారు.

కష్టించి పండించిన ధాన్యం సమృద్ధిగా ఇంటికి వచ్చిన సమయంలో రైతులు జరుపు పెద్ద పండగ సంక్రాంతి. కొత్త ధాన్యంలో ఆవు పాలు, బెల్లం కలిపి పొంగలి తయారు చేసి సూర్యభగవానుడికి నైవెద్యంగా సమర్పించి కుటుంబంలోని వాళ్ళు స్వీకరిస్తారు. పొంగలి మెతుకులు పోలమంతా చల్లుతారు, అందువల్ల పంట పొల్లుపోక, గింజరాలుబడి హెచ్చుతుందని, పంటలు సమృద్ధిగా పండుతాయని విశ్వసిస్తారు. ఈ ఆచారానికె **పొలి చల్లడం** అని పేరు. కనుమ రోజున కాకి కూడా ప్రయాణం

చేయ్యాదు అని సామెత, కాబట్టి ఈ రోజు ప్రయాణం నిషిద్ధం. మాంసాహారులు ఈరోజు మాంసాన్ని వండుకుంటారు, సాధారణంగా పందెంలో ఓడిపోయిన కోడినో, గొర్రెనో ఉపయోగించటం కనపడుతుంది. ఓడిపోయిన జంతువు పట్ల కూడా గౌరవ మర్యాదలని చూపటం అనే సంస్కారం కనుమ పండుగలో కనపడుతుంది.

పక్షులు పంట పాడు చేయకుండా ఉండేందుకు పురుగులను తిని సహాయం చేసినందుకు వాటికి కూడా కృతజ్ఞతలు చెప్తారు మన రైతులు.  అప్పుడే నూర్చిన వరి కంకులను తెచ్చి చక్కని కుచ్చులుగా చేస్తారు, ఇంటిముందు వసారాలలో కడతారు. కొన్ని ప్రాంతాలలో కనుమనాడు గుడిలో వ రికంకుల గుత్తులను కడతారు, అవి పక్షులకు ఆహారం అవుతాయి.

తమిళనాడులో ఆడపడుచులు పుట్టింటికి వచ్చి కనుమనాడు అన్నపు ముద్దలను ఊరి బయటకు తెచ్చి పక్షులకు పెడతారు. తమిళులు కనుమను **మాట్టు పొంగల్** అని అంటారు, తెలుగువారు పులగం అంటారు. కొత్త బియ్యం కొత్త పెసరపప్పు కలిపి వండిన పులగాన్ని ముందుగా దేవుడికి నివేదన చేసి కృతజ్ఞతను చూపిస్తారు. కొత్త బియ్యం లేగంటి ఆవుపాలలో వండి,  కొత్త బెల్లం వేసి పరమాన్నం తయారు చేయటం ఈ పండుగ తోనే ప్రారంభిస్తారు.

ఆధ్యాత్మిక కనుమ- అలనాడు గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలితో పైకెత్తి నందగోకులాన్ని  శ్రీకృష్ణపరమాత్మ రక్షించినది కనుమ పండుగ రోజునే అని చెబుతారు. పశుపోషణ, రక్షణ మానవ జాతి కర్తవ్యంగా నాటి నుంచి కనుమనాడు పశువులను పూజించే ఆచారం వచ్చిందని ఒక గాథ.

సంక్రమణ కాలంలో ప్రధానంగా పితృ తర్పణలు నిర్వర్తించాలి. ఇది పెద్దలను సంస్మరించుకునే పండుగగా మనవారు నిర్దేశించారు. మినుమతో చేసిన గారెలను కనుమనాడు పితృదేవతలకు నివేదిస్తారు. గోదావరి ప్రాంతాలలో ముత్తైదువులు సకల పిండివంటలతో పేడిగా నైవేద్యం వండి గ్రామదేవతలకు సమర్పణగా రజకులకు అందిస్తారు.

కొన్ని ప్రాంతాల్లో ఇంటి ఆడపడుచులు అన్నాన్ని పెద్ద పెద్ద ముద్దలుగా చేసి అన్నలకు చేతుల్లో ఉంచి మంచి జరగాలని కోరుకుంటారు. అన్నదమ్ములు వారిని ఆదరించి కృతజ్ఞత తెలుపుతారు.

సంక్రాంతి నాలుగోరోజు ముక్కనుమ అంటారు కాని ప్రత్యేకంగా చేయవలసినవి పెద్దగా కనిపించవు. పండుగలో అలసిపోయి విశ్రాంతి కోసం కావచ్చు కాని, కొంత కనుమ నాడు కాక ఈ రోజు మాంసాహారాన్ని తినటానికి కేటాయిస్తారు. కొత్తగా పెళ్ళైన ఆడవారు సావిత్రి గౌరీవ్రతాన్ని మొదలుపెడతారు తొమ్మిది రోజుల పాటు చేసే ఈ వ్రతాన్ని  గ్రామంలో ఉన్న ఆడవారందరూ కలిసి చేసుకుంటారు. మట్టితో చేసిన గౌరీదేవి బొమ్మని కుమ్మరి ఇంటి నుంచి మేళతాళాలతో తెస్తారు స్వయంపాకం, దక్షిణ ఇచ్చి గౌరవిస్తారు. అన్ని వృత్తుల వారిని గౌరవించడం సంక్రాంతి సాంప్రదాయాల పరమార్ధం.

❖❖❖❖❖



# ముగ్గులు

-శ్రీమతి అనురాధ నేదునూరి, హైద్రాబాద్

ముగ్గు అనగానే గుర్తొచ్చే పాట ముత్యాల ముగ్గుచిత్రం ఆరుద్ర గారు ఇలా అన్నారు...

ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయా ముత్తైదు కుంకుమ బ్రతుకంత ఛాయా.

ముద్దుమురిపాలొలుకు ముంగిళ్ళ లోన మూడు పూవులు ఆరు కాయళ్ళు కాయ.

ఆరనైదో తనము ఏ చోట నుండు అరుగులలికే వారి అరచేత నుండు.

తీరైన సంపద ఎవరింటనుండు దినదినము ముగ్గున్న లోగిళ్ళ నుండు.

అందుకే మన హిందూ సంప్రదాయంలో ముగ్గు కు ఒక ప్రత్యేకమైన విశిష్టత ఉంది.

పురాతన కాలంలో సూర్యభగవానుడిని ఆహ్వా నించ డానికి అందరి ఇళ్లముందు ఉదయ భానుడు ఉదయించక ముందే ముంగిళ్ళు ఊడ్చి ఆవు పేడ తో కల్లాపి చల్లి రంగవల్లులు తీర్చి దిద్దే వారు.

బియ్యప్పిండితో,సున్నపు గుల్ల తో వాకిట్లో ముగ్గు వేస్తారు ,

బొటమన వేలు చూపుడు వేలు కలిపి ముగ్గుని సన్నటి గీతలు, మెలికలు, రకరకాల లతలు వేస్తారు గీత ఎంత సన్నగా వేస్తే ఆ స్త్రీ యొక్క నేర్పరి తనం తెలుస్తుంది.

ఇక ముగ్గుని ఒక్కొరాష్టం లో ఒక్కో పేరుతో పిలుస్తారు. దక్షిణాదిలో ముగ్గు,రంగవల్లి అని,ఉత్తరాది లో రంగోలి అని,తమిళనాడు లో కోలం అని, బెంగాల్ లో అల్పన అని, రాజస్థాన్ లో మండన అని, మన సంస్కృతం లో మండల అంటారు.

ముగ్గుల లో మెలికల ముగ్గులు,చుక్కల ముగ్గులు,గీతల ముగ్గులు ఎక్కువగా వేస్తుంటారు.

ముగ్గులు ఉన్న లోగిళ్ళలో లక్ష్మి దేవి నివాసిస్తుందని లక్ష్మి స్తోత్రం లో చెప్పబడినది.

ముగ్గులేని ముంగిటకు ముష్టి దైన రాదు అనే సామెత ఉంది. ముగ్గుని కొంతమంది సందర్భానుసారం వేస్తారు


పండగలు పబ్బాలు ఉన్నపుడు పెద్దపెద్ద ముగ్గులు వేస్తారు.

ధనుర్మాసం ముగ్గులకు ప్రత్యేక మాసం ఈ మాసం లో గీతల ముగ్గులు నెలంతా రకరకాల ముగ్గులు రథాలు,మండపాలు,తేళ్ళు,(మకరం) వేస్తారు.

కొన్ని ప్రాంతాల్లో నెలంతా గొబ్బెమ్మలు పెట్టి అవి ఎండినాక సంకురాత్రి ముందు రోజు భోగి మంటలు వేస్తారు. కొన్ని ప్రాంతాల్లో భోగి రోజు ,సంకురాత్రి ,కనుమ మూడు రోజులు గొబ్బెమ్మలు పెట్టి వాటిపైన నవ ధాన్యాలు పూలు పసుపు కుంకుమ వేసి పూజిస్తారు.

కొన్ని ఆర్గనైజేషన్ లలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. వీటిల్లో స్త్రీ లు, పిల్లలు ఆనందంగా పాల్గొంటారు.

హిందూ సంప్రదాయాన్ని పాటించండి ఇంటిముందు ముగ్గు వేయండి.



❖❖❖❖❖

# రంగవల్లులు

-శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి, హైద్రాబాద్













❖❖❖❖❖

# యూరో ఫైటర్ టైఫూన్

-డా. మూర్తి జొన్నలగెడ్డ, సౌత్ పోర్టు, UK

యూరో ఫైటర్ టైఫూన్ రెండు జెట్ యంత్రాలతో ఎగిరే త్రిభుజాకారపు రెక్కలు గల యుద్ధ విమానం. ప్రధాన రెక్కలకు ముందు ఇంకొక జత చిన్ని రెక్కలు (కానార్డ్ రెక్కలు) ఉంటాయి. ఇవి సంక్లిష్టమైన ఆకాశ విన్యాసాలలోను, వాలుగా దూసుకు పోయే సమయంలోను నిలకడగా ప్రయాణించడంలో దోహద పడతాయి. 'ఐరోపా భవిష్య యుద్ధ విమాన ప్రణాళిక' కింద బ్రిటన్, జర్మనీ, ఇటలీ మరియు స్పెయిన్ మొదలగు దేశాలు 1983 లో ఈ విమాన నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. భాగస్వామి దేశాలలో అంతర్గత రాజకీయ కారణాల వలన మరియు రష్యా విఛ్చిన్నం తరువాత ప్రఛ్ఛన్న యుద్ధం అంతం కావడం వల్ల ఆలస్యమై ఎట్టకేలకు 2003 సంవత్సరంలో సేవలందించడం మొదలు పెట్టాయి.

భాగస్వామి దేశాలే కాకుండా, ఆస్ట్రియా, సౌదీ అరేబియా, ఒమన్, కువైట్ మొదలగు చాలా దేశాలు వీటిని కొనుగోలు చేశాయి. ఇది చాలా చురుకు, వేగం గల అత్యంత సమర్ధవంతమైన ఆకాశ యుద్ధ విమానం. ఆ కారణంగా ఇది శత్రు గగన తలాన్ని ఆక్రమించి ఆధీనంలోనికి తీసుకోవడం కోసం నిర్దేశింపబడింది. ఇవి 'స్టార్మ్ షాడో' మరియు 'బ్రిమ్ స్టోన్' వంటి అధునిక క్షిపణులను ప్రయోగించ గలవు కావున, నేల మీద లక్ష్యాలను కూడా ఛేదించ గలవు. స్వదేశ గగన తల పరి రక్షణ వీటి ప్రధాన విధి.

వీటి యుద్ధరంగ ఆరంగేట్రం 2011 లిబియా విమోచన యుద్ధంలో జరిగింది. వీటి అంతర్గత నిర్మాణం వలన, ఎలక్ట్రానిక్ నియంత్రణ వలన ఇవి ఏ వేగంతో ప్రయాణిస్తున్నా చాలా చురుకుగా దశ, దిశా నిర్దేశాన్ని మలచుకో గలవు. వీటిలో రాడార్లను, క్షిపణి దాడులను ఎదుర్కొనే సాంకేతిక పరిజ్ఞానం ఉంటుంది. చోదకుడు నోటి మాటతో యుద్ధ విమానాన్ని నిర్దేశించే పరిజ్ఞానాన్ని మొట్ట మొదటి సారిగా దీనిలో ఉపయోగించారు.

82 శాతం తేలిక పాటి పదార్థాలతో నిర్మించిన ఈ విమానం 11,000 కిలోల బరువు, 52 అడుగుల పొడవు 40 అడుగుల రెక్కల నిడివి కల్గి ఉంటుంది. సముద్ర మట్టంలో గంటకు 1500 కి. మీ. వేగంతో ప్రయాణిచ గల ఈ విమానం, సుమారు 65,000 అడుగుల ఎత్తులో గంటకు 2500 కి. మీ. వేగంతో ప్రయాణిచ గలదు. దీనికి ఒక 27 మి. మీ. మర తుపాకి, 13 క్షిపణులు ఉంటాయి. నిలిచి ఉన్న స్థితి నుండి ఎగరడానికి 6 సెకన్ల కన్న, శబ్ద వేగాన్ని మించిన వేగంతో దూసుకు పోవడానికి 30 సెకన్ల కన్న తక్కువ సమయం తీసుకునే ఈ విమానం సెకనుకు వెయ్యి అడుగుల చొప్పున ఎత్తుకెగర గలదు.

ఈ మధ్య కాలంలో రష్యా వారి యుద్ధ విమానాలు బ్రిటన్ గగన తల సరిహద్దులలో అనుమానాస్పదంగా ఎగురుతున్నప్పుడు వాటని నియంత్రించడానికి టైఫూన్ లను వినియోగించారు. సమాచారం అందిన వెంటనే విమానాశ్రయం నుండి బయలుదేరి తృటిలో శత్రువులను నియంత్రించ గల సామర్ధం ఎవరినైనా ఆశ్చర్య చకితులను చేస్తుంది. 2007 సంవత్సరంలో భారత దేశం మరియు బ్రిటన్ వైమానిక దళాలు సంయుక్తంగా నిర్వహించిన 'ఇంద్ర ధనుష్' విన్యాసాలలో భారత విమాన చోదకులు దీని యొక్క చురుకుగా కదిలే లక్షణాన్ని మెచ్చుకోవడం జరిగింది.

సాధారణంగా వైమానిక విన్యాసాలలో టైఫూన్ ఎగురుతున్నప్పుడు ఒళ్ళు గగుర్పొడిచే దాని రొదకు భూమి కూడా ప్రకంపిస్తుంటే పిల్లలు భయభ్రాంతులై రోదించడం మామూలే. అనూహ్యమైన విన్యాసాలు ప్రదర్శించి, నిట్ట నిలువుగా పైకెగసి క్షణాలలో మటుమాయం అయ్యే ఈ విమానం వెళ్ళిపోగానే ఆవరించిన నిశ్శబ్దంలో మనకు అంతవరకూ చూసింది కలా, నిజమా అనిపించక మానదు. కొన్ని ప్రపంచ దేశాలు అనవసర కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నప్పుడు దేశ రక్షణకు ఇటువంటి విమానాలు తప్పనిసరి అనిపిస్తుంది







❖❖❖❖❖

# వృద్ధబాలుణ్ణి నేను

-కీ.శే.శ్రీ గండికోట విశ్వనాధం

నాముందు వెనుక రెండేసి తరాల
జీవిత చక్ర భ్రమణాల మధ్య యెదిగిన
అయిదు తరాల వారి అంతరాల నెరిగిన
వృద్ధ బాలుణ్ణి నేను

నిశ్శబ్ద నిశీధిలో మందులు ముంచిన మత్తులో
కత్తుల కోతలతో, తల్లి వుదరం చించి
నాభీచ్ఛేధం చేసిన తరుణంలో
ఊపిరి తీసిన శిశువుని కాదు

బండెడు పుస్తకాల బస్తాతో లంఖణాలు మెలిపెట్టగ
నడుము వంగిన నడకల వడిలో, చదువుల సవ్వడిలో
శృతి మించిన బాల్యం కాదది

అనువంశిక రోగాలు,రోతలు పెంచని
సంతరించిన ధనభోగాలు పాతులుపంచని
ఆనందంతో   తల పండిన వృద్ధ్యాప్యం నాది
తొందరగా తల పండిన భాగ్యం కాదది
అయినా,ఎవరి తరం యోగ్యత ప్రయోజకత్వం వారిదని
మారే కాలంతో పరుగులెత్తి  దేశాలు దాటేరని
ప్రతిభా పాటవాలు చాటేరని
మాతృభూమి ఘనత నిలిపేరని ఒప్పుకుని చెప్పేలోపల
తాతలకే చదువు చెప్పగల
తెలుగు సంస్కృతికి వారసులు, బాల మేధావులు

స్వరాజ్య నినాదాల శంఖారావాల
భీషణ ఘోషణలకు,లాటీ తూటా ధ్వనులకు
అదిరిన జన్మభూమిలో, కదిలిన జన్మస్థలిలో
నా తొలి శ్వాస యెగసిందని
మురిసిన తల్లికి శిశువుని నేను

బానిస బ్రతుకుల శృంఖలాలు తెగ్గొట్టగ
నడుం కట్టిన మేటి తాతతండ్రుల
నడవడి వొరవడిలో చిగురించిన బాల్యం నాది

విలువలతో నేసిన ఆశయాల వలువల వలలో
బిగించి వుంచిన వారసత్వపు  చాదస్తపు
మమతానురాగల రంగుల హరివిల్లు నా నడిప్రాయం
ఆశలవిహంగాలపై విహరిస్తూ,వినోదిస్తూ
మిద్దెల,గద్దెల ముద్దుల మిధ్యాన్వేషణలో
సుందర స్వప్నపు జల్సాల ప్రాయం కాదది.

కమ్మని మాటలతో, రమ్మని పిలిచి గంటల తరబడి
కంప్యూటర్ మానిటర్ లో
ఆటలు,పాటలు, వైద్యం,సేద్యం మెయిల్సు,గ్రీటింగ్సు,యింటి
మోడల్సు,బాంకి బేలన్సు,టికెట్లు,గిఫ్టులు,వెబ్సైట్లు
అప్లికేషన్లు,బయోడేటాలు, ఇంటర్వ్యూలు
రియల్ దీపావళి సైట్ లో టపాసుల మోతలు
వివాహ పరిచయాలు, రకరకాల చిత్రాలు,జాతకాలు,
రాశి ఫలాలు, అణువు మొదలు అంగారకయానం వరకు
ఒకటేమిటి సర్వం, సమస్తంచూపిస్తూ, వినిపిస్తూ హసిస్తూ,
పరిహసిస్తూ నన్నొక పాతకాలపు వ్యక్తిగా అమాయకచక్రవర్తిగా
చిన్నారులు రువ్విన చిరునవ్వుల పువ్వుల సరసన
"అవురా" అని బోసి నవ్వులు పూసుకునే అవ్వకు వృద్ధ
బాలుణ్ణి నేను.

❖❖❖❖❖

# శుభాభినందనలు!

-శ్రీమతి విజయ చావలి, సిడ్నీ



కష్ట కాలమింక కరిగి పోవులే
నష్ట పెట్టు రోజులింక దరికి రావులే
మనిషి మమత విలువ తెలిపిన గతకాలం
మనీ మితం హితం గా మసలిన మిత కాలం
ఇహమందు గృహమందు సమతుల్యత లకు
విలువిచ్చిన గతకాలం
మలుపిచ్చిన కరోనాకలకలం
తరచి చూస్తూ
మరిచిపోతూ
పరుగుల జీవనానికి "కామా'లాగ
మెరుగైన పయనానికి "వూత' లాగ
మహమ్మారి కరోనా నేర్పిన జీవిత పాఠాలు
ఆశయాలకి పదును పెట్టి
ఆలోచనలకి అద్దం పట్టి
చేయి కలిపే ముందు ఆరోగ్యం తెలుచుకొని
చేత పట్టే ముందు అభిరుచులు మలచుకొని
చేయగలిగిన సాహసాలు
చేరగలిగిన సంతోషాలు
గురుతు చేసుకుంటూ సాగిపోవాలి
ఆశయాల పోగు చేసి
ఆచరణల బాగుచేసి
ఆలోచనల రేగనిచ్చి
ఆవేదన ల వీగనిచ్చి
ఆనందాల ఆగమనానికి
నూతన వత్సర మును ఆహ్వానించాలి

భవిత తలుచుకుంటూ
నలత నెదురుకుంటూ
భ్రమలు తొలుచుకుంటూ
ప్రేమలు పెంచుకుంటూ
బంగరు బాట వేయాలి
తెలియని వుత్సాహమేదో
తరగని వుత్తేజమేదో
కొత్త వత్సర మన్న కలుగు
కోటి కోర్కెలు గుప్పుమని వెలుగు
"కొత్త "పదంలోనే కలదు సొలపు
కొనగ లేని సొంపు తలపు
సామరస్య చెలిమి ని
సంఘటిత మైత్రి ని
శాంతియుత జగతి ని
స్వాగతిద్దాం
నిర్భయంగా నిరాటంకంగా
మహమ్మారి రక్కసుల
పొంచి వున్న శత్రు దాడుల
ఎదురు నిల్చి
బెదురు లేక
కలిసి పోరాడుదాం
ఆహ్వానిద్దాం ఆంగ్ల సంవత్సరాన్ని
ఆలపిద్దాం మంగళ గీతాలను
అందిద్దాం శుభాభినందనలను!

❖❖❖❖❖

# గజల్ - వ్యక్తిత్వ వికాసం

- డాక్టర్ కె.టి.పద్మజ, అమలాపురం



తెలుగు సాహిత్యంలో గజల్ ప్రక్రియలో అనేక అంశాలు చోటు చేసుకున్నప్పటికీ ప్రత్యేకించి, మనిషి సమాజంలో ఏ విధంగా జీవించాలో, సమస్యలను ఎలా అధిగమించాలో, వ్యక్తిత్వాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో అనే విషయాలను అనేకమంది కవులు తమ గజళ్ళలో పొందుపరిచి,వ్యక్తిత్వ వికాసం కలిగించడానికి కృషిచేశారు. వ్యక్తిత్వం అంటే వ్యక్తి స్వభావం అని అర్థం.మనిషిగా పుట్టి మనిషిగా ఎదగడానికి వేదికైన సమాజం పట్ల, మనిషికి ఉండే సంబంధమే వ్యక్తిత్వం.వ్యక్తిత్వం నిరంతరం వికాసం పొందాలి.మనిషి ఎదిగే కొద్దీ వ్యక్తిత్వం కూడా ఎదగాలి.ప్రతి మనిషి రోజురోజుకీ తనలోని చెడ్డగుణాలను తగ్గించుకొని,మంచి గుణాల సమాహారంగా నిలబడడమే వ్యక్తిత్వ వికాసం. వ్యక్తిత్వ వికాసానికి కలిసి బ్రతకడం,సవాళ్లను ఎదుర్కోవడం, ఆశావాదం, అనుకూల దృక్పథం,ఆత్మ విమర్శ, తార్కికత,శ్రమ తత్వం,బాధ్యతలను నెరవేర్చడం,హక్కులు పొందడం, పశ్చాత్తాపం,నిర్భయత్వం,నిస్సంకోచం,ప్రియ భాషణం మొదలైనవి ఎంతగానో తోడ్పడతాయి.

డాక్టర్ సి.నారాయణ రెడ్డి గారు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే తత్వాన్ని, ఆశావాదాన్ని క్రింది గజల్ లో వివరించారు.

సుఖమైన దుఃఖమైన ఒకటే నా భావన
సఖుడైనా శత్రువైనా ఒకటే నా దీవెన
బ్రతుకంతా పాడుకుంటా మృతిలోనా నవ్వుకుంటా
వెలుగైనా చీకటైనా ఒకటే నా స్పందన
ఎగిసింది హోరు కడలి ఎదురేగే నావ నాది
గెలుపైనా ఓటమైనా ఒకటే నా సాధన

డాక్టర్ సి.నా.రె కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని,జీవితంలో ఎదురయ్యే చీకటి వెలుగులకు ఒకే విధంగా స్పందించాలని, బాధలకు కృంగిపోకుండా సుఖాలకు పొంగిపోకుండా ఉండాలని అంటారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా సాధన ఆపకూడదని,నిరంతర సాధన,శోధన విజయానికి సోపానాలని వివరించారు.

జీవితం సవాళ్ళమయం.సవాళ్లను ఎదుర్కోవడం, వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి సోపానం అనే అంశాన్ని డాక్టర్ సినారె ఇలా అన్నారు.

గాలివాటుగా పడిపోతూ అది ఘనతగ భావిస్తే ఎలా
ఎదురీతలు అప్పుడప్పుడైనా లేనిదే పదునెక్కదు సాహసం
సరదాగా కాలాన్ని మీటుతూ తిరిగే ప్రాణులకేమిలే
అనుభవాల నాగళ్ళు దుక్కి దున్ననిదే పండదు మానసం
నలుగురి మెప్పుల కోసం జరిపే కలాపాలు పైపైనివే
తలమున్కలుగా శ్రమించనిదే ఫలితాలందించదు శోధనం.

ఆశయం,చేరుకోవాలనే కోరిక ఉంటే సరిపోదు.దానికి తగిన క్రమశిక్షణ,శ్రమతత్వం ఉండాలని అప్పుడే సాహసం పదునెక్కుతుంది.జటిలమైన పరీక్షలు ఎదురైనప్పుడు అనుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలని సినారె అంటారు.
డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గారు ప్రతిభ గురించి ఇలా అంటారు.

చేదకుంటే బావి నీరు చెడిపోతుంది
వాడకుంటే ప్రతిభ కున్న వడి పోతుంది
కలిముందని బలి ముందని కళను విడువకు
తప్పు సుమా! గుండెలోని తడిపోతుంది

బావిలో నీరు వాడకపోతే,నీరు కలుషితమైపోతుంది.అలాగే ఉన్న ప్రతిభను గుర్తించి సరైన క్రమంలో వినియోగించుకోకపోతే అది కనుమరుగైపోతుంది. సంపద, బలం ఉందని కళలను విడిచిపెడితే గుండెల్లో ఆర్ద్రత పోతుంది. రెంటాల మనిషి ఏవిధంగా జీవించాలో ఇలా తెలిపారు.

జీవిస్తే పసిపిల్లల లాగా జీవించాలంతే
మరణించామా యోధుల్లాగా మరణించాలంతే
గెలుపు నిజంగా ఎంత గొప్పదో తెలుసుకో గోరితే
సరైన మార్గం ఒక్కటే ఓటమి చవి చూడాలి అంతే

మనిషి పసిమనసుతో ఎలాంటి కల్మషం లేకుండా, జీవించాలి.జీవితంలో ప్రతి సవాల్ ని యోధునిలా ఎదుర్కోవాలి.ఓటమిని గెలుపుకి పునాదిగా చేసుకోవాలన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని,బాధ్యతలను నెరవేరుస్తూ నీతిగా బతకాలని శ్రీ రసరాజు ఈ గజల్లో తెలిపారు.

మూలాలను మరిచిపోయి పై చూపులు చూడకు
పల్లవితో పనిలేదని చరణమ్ములు పాడకు
మొదటి మెట్టు లేకుండా పైకి చేరగలవా
ఎంత ఎదిగినా మనిషీ! కృతజ్ఞతలు వీడకు
పుట్టినప్పుడే ఏదీ ఉవ్వెత్తున ఎగరదు
చేయూతను మరిచిపోయి దొంగాటలు ఆడకు.

సాయం చేసిన వారి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని,మొదటి మెట్టు లేకుండా పైకి ఎక్కడం అసాధ్యమని,కాబట్టి కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని శ్రీ రసరాజు ఈ గజల్లో వివరించారు. గమ్యం చేరడానికి ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా గమనం ఆపకూడదని,స్వయంకృషితో నడక సాగించాలని తెలిపే శ్రీ రసరాజు గజల్ ఇది.

గమ్యం నా ముందున్నది ఇంకా కదలాలి నేను
గతుకుల్లో సహనంతో కసిగా కదలాలి నేను
పడిపోతే నన్నెవరు పైకి లేపలేరు సుమా
పలాయనం పనికిరాదు కృషిలో బ్రతకాలి నేను.

శ్రీ సూరారం శంకర్ ఆశతో జీవిస్తే అసాధ్యం ఉండదని, ఆశావాదంతో విజయాన్ని సొంతం చేసుకోవచ్చని ఈ గజల్లో తెలిపారు.

నిర్వేదం వేదంగా మారితేనే ఉత్సవం
నీలో లోలో వేకువ పొదిగితేనే ఉత్సవం
నిరాశతో సాధించే సౌఖ్యం ఏముంది
నీ శ్వాసల్లో ఆశను కూర్చుకుంటేనే ఉత్సవం
ఎద మాటున ఏవేవో వ్యధలుంటే ఉండనీ
కాలంలా ప్రతి అడుగు కదిలితేనే ఉత్సవం
కన్నీళ్ళను జతకడితే కలను చేరలేవు
చైతన్యం నీపై చెలరేగితేనే ఉత్సవం
కొన్నిసార్లు కథలో నీ పాత్రేమిటి శంకర్
బ్రతుకంతా పాటై రవళిస్తేనే ఉత్సవం.

నిరాశ, నిస్పృహల వల్ల సంతోషం ఉండదు. మనసుని ఏకాగ్రతతో ఉంచుకొని, ఎన్ని బాధలు ఉన్నా ఆశతో జీవిస్తూ, కాలంతో పాటు అడుగు ముందుకు వేయాలని, ఆశను శ్వాసగా మార్చుకోవాలని శ్రీ పెన్నా శివరామకృష్ణ వివరించారు.

ఒక్క ముల్లుకే భయపడితే నీ కడుపే చెరువైపోతుంది
విశ్వంలోనికి చూపులు నిలిపితే సంద్రం బుడగై పోతుంది
అయిన దానికీ కాని దానికీ భయపడుతూనే ఉంటే
కొమ్మను వీడిన ఎండిన ఆకు చిచ్చులపిడుగైపోతుంది
గాయం ప్రమిదగ బాధను జ్యోతిగ భావించే మనసుంటే
చీకటి మరుగై ప్రతి రాత్రి ఇక పున్నమి వెలుగైపోతుంది

ప్రతిదానికి భయపడుతూ ఉంటే ఎండిపోయి,రాలిపోయిన ఆకు చేసే శబ్దం కూడా మనల్ని భయపెడుతుంది.కానీ నిర్భయంగా ముందుకు సాగితే సముద్రమంత సమస్య కూడా చిన్ని నీటిబుడగ అవుతుంది.మనసుకు తగిలిన గాయాన్ని ప్రమిదగా మార్చుకుని,బాధను జ్యోతిగా భావిస్తే సమస్యలు తొలగిపోయి ప్రతిరోజు పండుగ అవుతుంది. జీవితంలో ఉన్నత వ్యక్తిత్వంగల వ్యక్తిగా ఎదగడానికి, ఉన్నతమైన స్థానాన్ని పొందడానికి సమాజంలో కలిసి బ్రతకాలని, పరులకు ఉపకారం చేస్తూ జీవించాలని రోచిష్మాన్ ఈ గజల్లో తెలిపారు.

ఎదగాలని అనుకో ఎత్తుకెళ్ళాలని అనుకో

ఎదిగి ఎదిగి నువ్వొక ఎత్తై నిలవాలని అనుకో

మారాలని అనుకో మనిషై మసలాలని అనుకో

మానవతను ఇకపై మహిపై నిలపాలని అనుకో

నడవాలని అనుకో నదిలా సాగాలని అనుకో

సాగి సాగి ప్రజలకు సాయం చెయ్యాలని అనుకో

ప్రతి క్షణం విజయం సాధించడానికి, ఎత్తుకు ఎదగడానికి, ఊపిరి ఆగే దాకా ప్రయాణించాలని, తనను తాను చెక్కుకుంటూ వ్యక్తిత్వాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో తెలిపారు. చేయవలసిన పనిని సకాలంలో చేస్తేనే ప్రతిఫలం దక్కుతుందని డాక్టర్ ఎస్.ఆర్.ఎస్.కొల్లూరి కర్తవ్యాన్ని బోధించారు.

గుడి మెట్లు దిగాక గంట కొట్టలేదంటే ఎలా!

గది తలుపు మూశాక మది తట్టలేదంటే ఎలా!

గాయాలు గేయాలైనా గొంతు విప్పాలేవా!

కాలం కరిగినా కళ్ళు తెరవకుంటే ఎలా!

వేదిక దిగకముందే చప్పట్లు చరచలేవా!

వేదన మరిగినా పిడికిలి బిగవుకుంటే ఎలా!

చివరి గడువు దాటాక మొదలు పెడతావా!

ఫలితాలొచ్చాక పెన్ను రాయ లేదంటే ఎలా!

పెళ్లి కూతురైనా పారాణి పెట్టుకోవా!

పండుగ వస్తుంటే ముగ్గు పెట్టకుంటే ఎలా!

పూర్వజన్మ సుకృతాన్ని పండించుకోలేవా!

చరమదశలోనూ స్వామిని తలవకుంటే ఎలా!

గమనం అయిపోయాక గమ్యం కాదంటావా!

'కొల్లూరి' ఎదురైతే మనసు గెలవలేదంటే ఎలా!

ఏ పనిని ఎప్పుడు చెయ్యాలో తగిన విధంగా ఆ పనిని చేయాలి.సకాలంలో స్పందించాలి.ఉన్న సమయాన్ని వినియోగించుకోకుండా, తర్వాత అవకాశం రాలేదని చింతిస్తే ఉపయోగం ఉండదు. చేతులు కాలాక ఆకులు పట్టుకోకూడదనే భావాన్ని కవి వ్యక్తీకరించారు. గడిచిపోయిన క్షణం తిరిగి రాదు. కాలం గడిచిపోయాక బాధపడి ప్రయోజనం లేదంటారు. కష్టాలను నిర్భయంగా ఎదుర్కొన్నప్పుడే విజయం సొంతమవుతుందని తెలిపే డాక్టర్.ఎం.బి.డి శ్యామల గజల్ ఇది.

కాలానికి ఎదురీది గెలవాలని ఉంది

గాలానికి చిక్కకుండా ఎదగాలని ఉంది

సవాళ్ళే లేని బ్రతుకు చప్పనైన విందు

గురిచూసి లక్ష్యాలను కొట్టాలని ఉంది




భయమంటూ బెదిరి పోతే అడుగు కూడా పడదు ధైర్యం అనే మంత్రమేదో చాటాలని ఉంది. సమాజంలో ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా ఎదుర్కోవాలి, భయపడుతూ కూర్చుంటే ఒక అడుగు కూడా వేయలేము,ధైర్యంతో విజయాన్ని సొంతం చేసుకోవాలని తెలిపారు. ఈ విధంగా గజల్ కవులు కూడా తమ గజళ్ళ ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి ఎంతో కృషి చేశారు, చేస్తున్నారు.

❖❖❖❖❖



# కూనలమ్మ పదాలు

డాక్టర్ ఎస్.ఆర్.ఎస్. కొల్లూరి, అమలాపురం



తెలుగు కవిత్వం అనేక రూపాలుగా విస్తరించి,తెలుగు భాషను సుసంపన్నం చేసింది. ఆరుద్ర ద్వారా శిష్ట సాహిత్యంలోకి ప్రవేశించిన అచ్చమైన, అందమైన, క్లుప్తమైన జానపద పదం కూనలమ్మ పదం. ఆ పదంలో నీతి, లోకరీతి, ప్రశంస, కారం, చమత్కారం చక్కగా ఇముడుతాయి.చూడడానికి చిన్నరూపంగా కనబడుతున్నా, చక్కని భావాన్ని, చిక్కని కూనలమ్మ పదంగా సృష్టించడం కత్తి మీద సామే.

జప తపంబుల కన్న
చదువు సాముల కన్న
ఉపకారమే మిన్న
ఓ కూనలమ్మ

అన్న మిచ్చిన వాని
నాలి నిచ్చిన వాని
నపహసించుట హాని
ఓ కూనలమ్మ

మగని మాటకు మాట
ఎదురు పల్కెడు బోటి
మృత్యుదేవత సాటి
ఓ కూనలమ్మ

కాపు వాడే రెడ్డి
గరిక పోచే గడ్డి
కానకుంటే గుడ్డి
ఓ కూనలమ్మ

కవితా రసపు జల్లు
ఖడ్గాల గలు గల్లు
కారణాలకే చెల్లు
ఓ కూనలమ్మ

దుర్యోధనుడు భోగి
ధర్మరాజొక జోగి
అర్జునుండే యోగి
ఓ కూనలమ్మ

భీష్మ డనుభవశాలి
భీముడే బలశాలి
కర్ణుడే గుణశాలి
ఓ కూనలమ్మ

ఆడితప్పిన వాని
నాలి సేలని వాని
నాదరించుట హాని
ఓ కూనలమ్మ

ఈ 8 ప్రచారంలో ఉన్న పాత కూనలమ్మ పదాలు. వీటిని తొలిసారిగా చదువుతున్నప్పుడు ఆరుద్ర గారికి కలిగిన భావాలను వారి మాటల్లోనే చూద్దాం.

" ఈ పాత కూనలమ్మ పదాల కాలనిర్ణయం చాలా కష్టమైనపని.ఏడుగురు అక్కలతోబాటు వుండే పోతురాజు భార్య కాబట్టి కూనలమ్మ చాలా ప్రాచీన దేవత కావచ్చుననిపిస్తుంది.

వీటిని తొలిసారిగా చదువుతున్నపుడు అవి నన్నెంతో ఉత్తేజ పరిచాయి. కదిలించాయి, కవ్వించాయి.వీటి దివ్యలాఘువం నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది. ఛందస్సు ఆకర్షించింది.అనల్ప శిల్పం ఆశ్చర్య చకితుణ్ణి చేసింది.అంత్యప్రాసలు మనకు విజాతీయం కావని నిరూపించడానికి యీ పదాలను యెప్పుడేనా ఉపయోగించుకోవచ్చునని నిట్టూర్చాను.

ఈ పదాల సంవిధానాన్ని కూలంకుషంగా బోధ పర్చుకోవడానికి ప్రయత్నం చేశాను. ఆ రహస్యాలను ఆకళించుకొన్నాక యిలాంటివి వ్రాసి వీటిని ప్రచారంలోకి తీసుకురావాలనే కోరిక అవ్యక్తంగా నాలో మొగ్గ తొడుగుతూవుంది.

ఛందస్సు :

ఈ పదంలో మకుటేతర పాదానికి పదిమాత్రలు కచ్చితంగా ఉండాలి.లేకపోతే నడక కుంటుతుంది.

ఆ పదిమాత్రలు కూడా ఒక క్రమబద్ధమైన విరుపులలోనే ఉండాలి.3+4+3 లేక 5+5 అనే లెక్కలో ఉంటేనే యీ మాత్రల విరుపులు కర్ణపేయంగా ఉంటాయి.మాత్రల కొలమానంలో మొదటిదానిని గణాలలోనికి తర్జుమా చేస్తే పాదానికి మొదట ఒక సూర్యగణం తరువాత ఒక నాలుగుమాత్రల గణం,చివర ఇంకొక సూర్యగణం ఉండాలని చెప్పవచ్చును.అంటే

III + IIII + III

అనే గణవిభజన రకరకాలుగా మార్పులుచేసి ప్రస్తరించి వాడుకోవచ్చును. గణితశాస్త్ర రీత్యా చూస్తే యీవిభజనలో 45 రకాల విరుపులకు ఆస్కారముంది. ఐనా యిందులో వగణ జగణాలను రానివ్వగూడదు. వస్తే కందం బేసిలో వచ్చినప్పుడు గతి చెడినట్టే దీనిలోనూ చెడుతుంది.ఈ గణాలు లేకుండా ప్రస్తరించితే 16 రకాల శ్రావ్యమైన విరుపులు వీలవుతాయి.

ఈ పదంలోని అందమంతా తొలి మూడు పాదాల అంత్యప్రాసలే అని అందరూ అంగీకరిస్తారు.తెలుగు పాటకు సహజమైన ఆది ప్రాసలు వివిధ పాదాల అధ్యక్ష మైత్రి ఈ పదం లో కూడా ఆకర్షణీయమే."

అంటారు ఆరుద్ర. ఆరుద్ర కలం నుండి జాలువారిన కొన్ని కూనలమ్మ పదాలు.

చిన్న పాదము లందు
చివరి ప్రాసల చిందు
చేయు వీనుల విందు
ఓ కూనలమ్మ

జాతి ఛందము లోన
నీతి చెప్పెడు జాణ
మీటు హృదయపు వీణ
ఓ కూనలమ్మ

పెను సమాసము లున్న
పెద్ద వృత్తము కన్న
చిన్న పదమే మిన్న
ఓ కూనలమ్మ

నీవు పలికిన రీతి
నేను పాడెద నీతి
నీకు చెందుట ఖ్యాతి
ఓ కూనలమ్మ

**శ్రీశ్రీ గురించి -**

రెండు శ్రీల ధరించి
రెండు పెగ్సు బిగించి
వెలుగు శబ్ద విరించి
ఓ కూనలమ్మ!

**బాపు గురించి -**

కొంటెబొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండె ఊయలలూపు
ఓ కూనలమ్మా!

కూనలమ్మ పదాలు
లోకానికి సవాలు
ఆరుద్ర చేవ్రాలు
అంటాడు శ్రీశ్రీ

ప్రముఖకవి,సాహిత్య విమర్శకులు డాక్టర్ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు రచించిన కూనలమ్మ పదాలు..

ఆకేసి ఆయమ్మ
అన్న మిడును గదమ్మ
చెట్టన్నపూర్ణమ్మ
ఓ కూనలమ్మ

పరుల మేలును కోరి
పాదము లల్లెడువారి
పథము చక్కని దారి
ఓ కూనలమ్మ

ఆశ పెరిగిన వాడు
అహము పెరిగిన నాడు
తనకు తానే కీడు
ఓ కూనలమ్మ

**కృష్ణశాస్త్రి గురించి -**

కొంతమందిది నవత
కొంతమందిది యువత
కృష్ణశాస్త్రిది కవిత
ఓ కూనలమ్మ!

ఆరుద్ర కూనలమ్మ పదాలకు"ముమ్మాటికి"అనే ముందుమాటలో మహాకవి శ్రీశ్రీ ఇచ్చిన కితాబు.

కూనలమ్మ పదాలు

వేనవేలు రకాలు
ఆరుద్రదే వ్రాలు
అంటాడు శ్రీశ్రీ

కూనలమ్మ పదాలు
కోరుకున్న వరాలు
ఆరుద్ర సరదాలు
అంటాను శ్రీశ్రీ

బువ్వ వడ్డించుకుని
ముద్దొకటి తీసుకుని
రైతునే తల్చుకుని
ఓ కూనలమ్మ

పరిణయం స్వర్గాన
జరిగేటి పక్షాన
ఏం జరుగు నరకాన?
ఓ కూనలమ్మ

బుక్కు రీడింగు వీడు
బోర్లిష్టమన్నాడు
ఫేసుబుక్కట చూడు
ఓ కూనలమ్మ

అడుగడుగునా అందు
ఆలు బొమ్మల విందు
కనుక ఆల్బమ్ అందు
ఓ కూనలమ్మ

సంస్కారమే మాట
సంపేదనే పాట
బాలు తియ్యని నోట
ఓ కూనలమ్మ

సంత చేసిననాడు
ఇంతి సణగనివాడు
ధన్యుడగు మగవాడు
ఓ కూనలమ్మ

గొప్ప మేజర్ గారు
కూడ గెలవగలేరు
ఒక ఎలుకతో పోరు
ఓ కూనలమ్మ

కదలొద్దు సభకంది
కరోనా, ఏమైంది
సభె ఇళ్ల కొచ్చింది
ఓ కూనలమ్మ

ఈ విధంగా కూనలమ్మ పదాలు నాటినుండి,నేటి వరకు కవులను ఆకర్షిస్తునే ఉన్నాయి,సహృదయులైన సాహితీ ప్రియులు ఆదరిస్తూనే ఉన్నారు.

❖❖❖❖❖




# నేను..........

-శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్

నేను.................

చిత్రలేఖనం నేర్చుకుని వుంటే

బాపుగారిలా బొమ్మలు గీసివుండేవాడిని

సంగీతం నేర్చుకుని వుంటే

ఘంటసాలవారిలా పాడగలిగి వుండేవాడిని

వేదవ్యాసులవారి దగ్గర చదువుకుని వుంటే

భారత భాగవతాదులను తిరగవ్రాసేవాడిని

శివాజి దగ్గర కత్తిసాము నేర్చుకుని వుంటే

ఒంటిచేత్తో దేశాన్ని చోరబాటుదారుల నుంచి కాపాడగలిగే వాడిని.

బ్యాటు పట్టుకోవడం నేర్చుకుని వుంటే

బంతికి ఆరు చొప్పున పదిహేడు బంతులలో శతకం బాదివుండేవాడిని

బంతి విసరడం నేర్చుకుని వుంటే

బంతికి ఒకరి చొప్పున రెండు ఓవర్లలోపే అందర్నీ ఔట్ చేసివుండేవాడిని

రాకెట్ పట్టడం నేర్చుకుని వుంటే

దశాబ్దాలపాటు గ్లాండ్ స్లామ్ లు సాధించి వుండేవాడిని

ఆంగ్లశాస్త్రాలు నేర్చుకుని శాస్త్రజ్ఞుడినై వుంటే

రాకెట్ తయారుచేసి అందులో కుజగ్రహానికి వెళ్ళి వచ్చివుండేవాడిని

పైవాటిలో ఏ ఒక్కటి చేయగలిగినా ద్వాదశార్కప్రభలతో

దుర్నిరీక్ష్యతేజోవిరాజమానుడినై వుండేవాడిని

అవేమీ చేయలేక మిణుగురులా ఇలా

కాలం వెళ్ళబుచ్చుతున్నాను.

❖❖❖❖❖



# అమెరి"కరోనా కకావికలం' కథ

--వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

గత అనేక నెలలగా ఈ కోవిడ్-19 అనగా కరోనా అనే ఒకానొక సూక్ష్మజీవి ప్రపంచం లో సృష్టిస్తున్న కకావికలం అంతా ఇంతా కాదు. కనీసం ఆరు అడుగుల లెక్కన మొగుడు, పెళ్ళాలు "సంసారిక దూరం", ఇతరులు 'సామాజిక దూరం' పాటిస్తూ, పార్టీలూ, గీర్టీలూ, పబ్ లూ, పిక్నిక్ లూ, పెళ్ళిళ్ళూ, సామూహిక వ్రతాలూ, ఆఖరికి తద్దినాలూ, సంతర్పణలూ, రోజు వారీ సన్మాన సభలూ, శాలువా కప్పుడూ, చెక్క ముక్కల పంపిణీలూ కూడా మానేసి ఈ భూగోళం లో ఉన్న మానవాళి యావత్తూ ప్రాణాలని కాపాడుకోవలసిన ఈ విపత్కర సమయం లో కేవలం ఊహా జనిత 'అబద్ధపు'ఉదంతాలతో ఈ 'కరోనా కకావికలం" వ్రాయడం దుస్సాహసమే కానీ పాఠకులకి ఆట విడుపు కోసం కాస్సేపైనా ఆహ్లాదం కలిగించగలడమే నా ఉద్దేశ్యం అని మనవి చేసుకుంటున్నాను. నవ్వొచ్చినప్పుడు నవ్వడం కన్నా ఏడుపు వచ్చినప్పుడు నవ్వడమే చెప్పుకోదగ్గ విశేషం అన్నారు బహుశా ముళ్ళపూడి వారు.

ఈ కరోనా లాంటి అంతు పట్టని మహమ్మారిని గుర్తించి, బయట పెట్టిన ఆ చైనా డాక్టర్ ని ముందు నోరు మూయించి, తర్వాత జైల్లో పెట్టాక ఆయన చనిపోయాక ఎంత ప్రయత్నించినా కూడా ఈ కరోనాఎగుమతిని ఆపడం ఎవరి వల్లా కాలేదు. పైగా అది గగన విహారి. అంటే విమానాల్లో ప్రయాణం చేస్తూ దేశ దేశాలకీ వెళ్ళి స్థిరపడుతుంది. కానీ ఎప్పుడైతే మనం ఎవరినీ ముట్టుకోకూడదూ, ఆరు అడుగుల 'సామాజిక దూరం" పాటించాలీ అనే సూత్రంవిన్నానో ఎందుకైనా మంచిది అని ఆ దూరం ఇంకా బాఘా పెంచి మా క్వీన్ విక్టోరియా ని ఇండియా పంపించేశాను.

ఇక డానల్డ్ ట్రంప్ గారు కుటుంబ సమేతంగా ఇండియా విహార యాత్రకి వెళ్లినప్పటికే ఈ కరోనా ప్రపంచం అంతా వ్యాపించడం మొదలు పెట్టినా అప్పటికి ఈ ఆరు అడుగుల దూరం ట్రిక్కు తెలియక ఆయనా, మోడీ గారూ, మోడీ గారు విరామం ఇచ్చినప్పుడల్లా భారత రాష్ట్రపతి కోవింద్ గారూ ట్రంప్ గారితో ఎడాపెడా కర చాలనాలూ, హగ్గింగులూ, వీపులు గోక్కోవడాలూ, చేతులు కలిపి గాల్లో తెగ ఊపేయడాలూ జరిగేశాయి. తీరా ఆయన అమెరికా తిరిగి వచ్చాక ఈ కరోనా తీవ్రతరం కావడంతో ట్రంప్ గారు కోవిడ్ అనబోయి కోవింద్ అంటు వ్యాధి అని ప్రస్తావించడమే కాక"అమెరికా వాసులారా, అందరం కలిసి ఆ కోవింద్ కోరలు పీకేద్దాం. మీరు చెయ్యవలసిందల్లా కొన్నాళ్ళ పాటు కరచాలనాలు, హై ఫైవ్ లూ, హగ్గింగులూ తదితర 'ఒకరిని ఒకరు ముట్టుకునే పనులు" వాయిదా వేసి "నమస్తే" అంటూ దూరం నుంచే పలకరించుకుంటూ మాతో సహకరించండి" అని సాక్షాత్తూ శ్వేత సౌధం లోనే విలేఖరుల సమావేశం లో రెచ్చిపోతూ ఉండడం, వెనకాల బుద్ధిగా మంచి బాలుడు టైపులో చేతులు కట్టుకున్న అమెరికా ఉపాధ్యక్షుల వారైన మైక్ పెన్స్ గారు ప్రెసిడెంట్ గారి వెనకాల వేపు చేతికి అందిన చోట రహస్య గిల్లుడు గిల్లడం, కోవింద్ కాదు బాబోయ్ అని దాన్ని కోవిడ్-19 గా ట్రంప్ గారు సరిదిద్దుకోడం బహుశా నేను ఒక్కడినే గమనించి ఉంటాను. అదే కనక సిఎన్నెన్ లాంటి టీవీ వారు గమనించి ఉంటే..ఓరి నాయనోయ్....నా మాట అబద్ధం అయితే మరి ట్రంప్ గారు స్వయానా ఈ కోవిడ్ 19 తనకి సోకిందేమో అని ఎందుకు వైద్య పరీక్షలు చేయించుకునట్టూ? ఈ వెటకారం వెలగని వారికి కోవింద్ మన భారత రాష్ట్రపతి గారి పేరు అని గుర్తు చేస్తున్నాను. అయినా వెలగని ట్యూబ్ లైట్లకి స్విచ్ ఆఫ్ చేస్తున్నాను.

మైక్రోస్కోప్ లో చూస్తే మా చిన్నప్పుడు ఆడేసి పారేసి, బొచ్చు సగం ఊడిపోయిన బాల్ బాడ్ మింటన్ బంతి లా ఉండే ఈ మహమ్మారి గాలిలో రెండు గంటలు, రాగి, కంచు మీద నాలుగు గంటలూ, స్టీలు పళ్ళాల మీద ఎనిమిది గంటలూ, ప్లాస్టిక్ మీద ఒక రోజు బతికి ఉండి మనుషుల మీదకి దాడి చేస్తుంది అని ఇప్పటి దాకా తెలిసిన కొంత సమాచారం. అది తెలియగానే "అన్నీ వేదాల్లోనే ఉన్నాయిట" అనే ప్రగాఢమైన, బలమైన చాదస్తపు వాదం మళ్ళీ తెర మీదకి...అదే....ఫేస్ బుక్ లోకి ఎక్కింది.

ఉదాహరణకి "నారదోపాఖ్యానం లో మూడో అధ్యాయం, నాలుగో శ్లోకం లో పూజ లో వాడే ఉద్ధరిణ, పంచ పాత్ర రాగి వే ఉండాలి అని మన మహర్షులు నిర్దేశించడానికి శాస్త్రీయపరమైన సిద్ధాంతం ఈ సూక్ష్మ జీవుల వ్యాపక నిరోధన శక్తి ఆ లోహానికి ఉండడం మాత్రమే" అనే ఒక నన్ను బాగా ఆకట్టుకున్న ఒక ముఖ పుస్తక ఉవాచ. మరొకటి "ఒక చెంచాడు గీకేసిన, గోకేసిన వెల్లుల్లి, మరొక చెంచాడు తోలు తీసేసిన, అతి చిన్న ముక్కలుగా కోసేసిన అల్లం, ఒక చెంచాడు తేనె, కాస్త నిమ్మ రసం" అన్నీ రంగరించి, గుటుక్కుమని ఒకే గుక్కలో తాగితే ఈ కరోనా యే కాక దాని అమ్మ కూడా మీ జోలికి రాదు. ఒక వేళ వస్తే ఇంకెక్కడికీ పోదు" అనే మరొక ఫేస్ బుక్ పోస్ట్ కూడా నన్ను బాగా ఆకర్షించి కానీ ఇండియాలో ఉన్న మా క్వీన్ విక్టోరియా దాన్ని తీవ్రంగా ప్రతిఘటించింది. ఎందుకంటే ఆ ద్రావకాన్ని కేవలం మట్టి గళాసులోనే తాగాలిట. అవి అమెరికాలో దొరకవు కాబట్టి తను వెనక్కి వచ్చేటప్పుడు కూడా పట్టుకొచ్చే దాకా బుద్ధిగా ఉండమని హెచ్చరించింది. ఇక గోమూత్రానికి ఉన్న సర్వ కరోనా రోగ నివారణ శక్తి గురించీ వచ్చిన అధికారిక వ్యాఖ్యలు చెప్పనే అక్ఖర లేదు. ఈ సారి మా క్వీన్ విక్టోరియా పెట్టెలలో సగం మట్టి కప్పులూ, సగం ఆర్గానిక్ గోమూత్రం సీసాలూ ఉన్నా ఆశ్చర్య పోను. ఇక తెలుకాటుకి వేద మంత్రం లాగా వేదాలలోనే ఉన్న కరోనా మంత్రం వెతికి తీసి ఆ మాయ రోగాన్ని కుదిర్చే దొంగ బాబాలూ, స్వామీజీలూ, 'విష జ్వర పీడ హర యాగం' చేయించే వారు ఈ పాటికి చాలా మందే అవతరించి ఉంటారు.

అంతెందుకు, ఒకానొక టీవీ చర్చా వేదికలో మిగతా దేశాల కంటే భారత దేశం లొ కరోనా వ్యాప్తి బాగా తక్కువగా ఉండడానికి కారణం మనది కర్మ భూమి అనీ, మనల్ని ఏదో శక్తి రక్షిస్తోంది అనీ ఖచ్చితంగా చెప్పాడు. నిజానికి అలాంటి శక్తి మనల్ని రక్షించాల్సింది రాజకీయ నాయకుల నుంచి. అయితే గత పదిహేను రోజులగా అన్ని తెలుగు టీవీ చర్చా వేదికలలోనూ అసభ్యంగా అరుచుకుంటూ కొట్టుకు చచ్చిపోయే రాజకీయ దౌర్భాగ్యుల బదులు డాక్టర్లూ, శాస్త్రవేత్తలూ మాత్రమే కనపడుతూ మంచి సమాచారాన్ని ఇస్తూ ఉండడం బావుంది.

మొన్న మా అర్ధాంగి తో ఇండియా వాట్సాప్ ఫోన్ పెట్టెయ్యగానే, మళ్ళీ నా సెల్ ఫోన్ మోగింది. 'హాయ్, రాహూ, దిస్ ఈజ్ బార్బరా" అనగానే నేను "ఏమోయ్, ఎప్పటిలాగానే అందంగా ఉన్నావా?"అన్నాను
నా సహజ ప్రవృత్తిలో..అదేమిటో అమ్మాయిలతో మాట్లాడినప్పుడు అలా అనడం
నా అలవాటు మరి. ఏం చేస్తాం.? మామూలుగా అయితే ఆ చక్కటి అమెరికా పిల్ల కిచ కిచా నవ్వేసును కానీ ఈ సారి భోరుమని ఏడ్చేసింది. నేను నిర్ఘాంతపోయి "ఏమయింది, బార్బ్...మళ్ళీ విడాకులా" అనగానే "యువర్ స్టాక్స్.. పోర్ట్ ఫోలియో ..." అని మళ్ళీ వల, వలా భోరుమంది మా బార్బరా.

ఆ బార్బరా అనే దొరసాని మా ఆర్థిక సలహాదారు. అనగా నేను అస్సలు కష్టపడకుండానూ, మా క్వీన్ విక్టోరియా జీవితాంతం ఎంతో కష్టపడీ కలిసి మెలిసి పొదుపు చేసుకున్న పావలా, అర్ధా ఆర్థిక వనరులకి కాపలా దారు. తెలుగులో చెప్పాలంటే ఆ అమ్మాయి ఇన్వెస్ట్మెంట్ అడ్వైజర్' అనమాట. అలాంటి కీలకమైన అమ్మాయి ప్రత్యేకంగా ఫోన్ చేసి భోరుమని విలపిస్తూ ఉంటే నా హృదయం కరిగి పోవడం మానేసి, ఆ పిల్లని 'హగ్గింగ్' పేరిట దగ్గరకి తీసుకుని ఊరట కలిగించే అవకాశం లేదు కాబట్టి నా గుండె కాయ మరింత వేగంగా కొట్టుకోవడం మొదలు పెట్టింది. ఆ హృదయ వేగాన్ని అదుపులో తెచ్చుకునే ప్రయత్నం లో ఉండగా ఆ పిల్ల గద్గద స్వరంతో "కరోనా, కోవిడ్, ట్రంప్, ఎకానమీ, స్టాకుల ఘోర పతనం" లాంటి మాటలు మాట్లాడగానే నాకు విషయం అర్ధం అయి, సోఫాలో కూలబడ్డాను. ఇక ఏమనాలో తెలియక "ఎంత?" అని బార్బరా ని అడిగాను. "ఎంత క్షవరం అయిందో చెప్పమంటావా, లేక ఇంకా ఎంత మిగిలిందో చెప్పమంటావా?" అంది పాతాళ భైరవిలో +ఎన్ టీ ఆర్ టైపులో బార్బరా. చెప్పొద్దూ, బార్బరా అనే ఆ పిల్ల ఆర్థిక సలహాల వలన మనకి జరిగినది తిరుపతి బాపతు సగం క్షవరమో, లేక మా ఆస్థాన మంగలి వీర్రాజు మా అమ్మమ్మకి చేసే సంపూర్ణ గుండు

గీకుడో తెలియక, ఏది ఏమైనా తన వృత్తి పేరు నిలబెట్టుకుంది అనిపించింది. ఎందుకంటే అమెరికాలో క్షవరం చేసే మగాడు బార్బర్. అదే ఆడమ్మాయి అయితే బార్బరా....ఏ రాయి అయితేనేం, పళ్ళు రాలగొట్టుకోడానికి? మొత్తానికి కరోనా ధర్మమా అని “ఉన్నది కాస్తా ఊడింది. పెళ్ళాం నగలతో సహా తిరు క్షవరమై పోయింది” కానీ పెళ్ళాం నగలు ఇండియాలో ఉన్నాయి కాబట్టి అవి మిగిలి పోయాయి అనే అనుకుంటున్నాను.

సీరియస్ లీ...

ఇది వరకూ వచ్చిన విష జ్వరాల మాట ఎలా ఉన్నా, ఈ నొవెల్ కోవిడ్ -19 అనే కరోనా కి మందు ఏమిటో అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న డాక్టర్లకీ, శాస్త్రవేత్తలకీ ఇంకా అంతు పట్టడం లేదు. ప్రస్తుతం మనం అందరం చెయ్యగలిగినదీ, చేసి తీర వలసినదీ ఆ వ్యాధి వ్యాపించకుండా “స్వయం ప్రకటిత వెలివేత” పాటిస్తూ శరీరాలకి దూరంగా ఉంటూనే మన వారి మనసులకి దగ్గర అవడమే ఏకైక మార్గం. ఏమంటారు? ఏకంగా బ్రిటన్ యువరాజు ప్రిన్స్ చార్లెస్ కీ, ప్రధాన మంత్రికీ, హాలీవుడ్ మెగా నటుడు టామ్ హాంక్స్ లాంటి వారికే కరోనా సోకగా లేనిది, ఆఫ్టరాల్ నేనూ, మీరూ ఒక లెక్కా అని అనుకోవచ్చును కానీ అది నిజం కాదు. మనం కూడా లెక్కించదగిన వాళ్ళమే. అందుకే మనల్నీ, మన పక్క వారినీ కాపాడుకోవడం ఇప్పుడు మన ఏకైక కర్తవ్యం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలతో...హేపీ క్వారంటీన్....

❖❖❖❖❖




❖❖❖❖❖

# రచనలలో సందర్భోచిత పదప్రయోగం

-శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ

ఆధునిక తెలుగు రచనలలో రచయితల భాషాపటిమ వారు ఉపయోగించిన పదాలని బట్టి ఉంటుంది.

మృదుమధురమైన పదాలు, వ్యర్ధ పదాలు రాకుండా ఒకే పదం పునరావృత్తం కాకుండా పదప్రయోగాలు రచనలలో కొనసాగితే, చదివే పాఠకుల మదిని రంజింపచేస్తుంది. తెలుగుభాషా సౌందర్యపరిధి కూడా విస్తరిస్తుంది. మనసులోని భావం, పాత్రల స్వభావం, సందర్భం, పాఠకులకు చేరడానికి రచయిత తగిన పదాలను ఎంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రముఖ రచయితలు, వారి భావనా తరంగాలను వ్యక్తీకరించడానికి ఏ విధమైన పదాలు తీసుకున్నారో ఇపుడు తెలియచేస్తాను.

బీనాదేవి సమగ్ర కథలు - కథ పేరు 'చెకుముకి నిప్పు'. చెకుముకి అంటే రెండు రాళ్ళతో నిప్పును రాచేయడం. ఒక్కోసారి కథ పేరుని బట్టి పాఠకులకు ఆసక్తిని రేకెత్తిస్తుంది.

సత్రం భోజనం, మఠం నిద్రలా ఉంది నా బ్రతుకు అని బాధ పడేవాడు తండ్రి. భార్య పోయింది. కొడుకులు, కూతుళ్ళు ఉండి కూడా తండ్రికి ఆ దుస్థితి. ఈ ఒక్క వాక్యంలో మొత్తం పరిస్థితి అవగతమవుతుంది. మంచితనం ఉండాల్సిందే కానీ మోతాదు మించిన మంచితనం మంచిది కాదు.  కథ చదువుతున్న చదువరికి సందేశాన్ని కూడా ఇస్తోంది ఇక్కడ ఈ వాక్యం. అలా ఉండద్దు, ఇలా ఉండమని నిర్దేశిస్తోంది. చిన్నప్పుడు స్కూళ్ళలో ఆంధ్రనామ సంగ్రహం తెలుగు భాష, అమరకోశం సంస్కృత భాష పదాల పరిధి పెరగటం కోసం చూడమనేవారు ఉపాధ్యాయులు.

ప్రిన్సిపల్ వినడానికి, చదువుకోవడానికి ఇంపుగానే ఉంటాయి. అనుభవంలోకి వచ్చేసరికి చావుదెబ్బ కొడతాయి. అంచేత వాటిని పాటించే వాళ్ళకి ఆ చావుదెబ్బకి తట్టుకునే ధైర్యం కూడా ఉండాలి. ఆనందరావుకి ఆ ధైర్యం ఉంది. ఇదీ కథ అంటే అనిపిస్తుంది పాఠకునికి

ఇలాంటి కథలు చదువుతున్నపుడు. ఊరికే సూక్తి ముక్తావళి పుస్తకం ఇచ్చి చదవమంటే చదివి ఆచరణలో పెట్టకపోవచ్చు. కానీ కథగా మలచి పాత్రద్వారా అటువంటి అనుభవపూరిత వాక్యాలని జోడిస్తే అది సందర్భోచితమే కదా!

శ్రీ పెయ్యేటి రంగారావుగారి కథ ‘ఉపవాసి’ పేరు చూడగానే కథపై పాఠకునికి ఊహాగానాలు మొదలవుతాయి. ఆ పాత్ర వాగీశంగారు మంచి పుష్టిగా ఉంటాడు. అందమైన పొన్నకాయలాంటి బొజ్జ. అవును మరి,బొజ్జ ఉండకే చేస్తుంది! మంచమీంచి లేవకుండానే అతడి ఆలోచనలు తిండి మీదకు వెళ్తాయి. ఇక్కడ రచయిత పాత్ర గురించి చెపుతూ ఎంత ఆహారప్రియుడో, పాత్ర ఆకారాన్ని పొన్నకాయతో పోల్చారు.పొన్నకాయ ఊహలోకి రాగానే మనిషి ఆకారం కూడా మదిలో మెదులుతుంది. ఇక్కడ ఇంకా కథలో చదువుతూ ఉంటే ఇవాళ లలిత టిఫిన్ ఏం చేస్తోంద్ చెప్మా? ఉప్మా కాకూడదు. హిరణ్యకశిపుడికి శ్రీహరి వైరి అయినట్లు తనకు ఆజన్మ శత్రువైన ఉప్మా చెయ్యకుండా ఉంటే చాలు. ఆ మనిషికి ఉప్మా మీద అయిష్టతను పురాణాలలోకి తీసుకెళ్ళి కరికి, హిరణ్యకశిపుడికి ముడి పెట్టేసారండి. సరే ఇంక అసలు ఈ ఆడవాళ్ళ మనస్తత్వం మగాళ్ళకి చచ్చినా అర్థంకాదు. తనకి ఇష్టం లేదు మొర్రో అన్నా వారానికి ఒక్కసారైనా ఉప్మా చెయ్యకుండా ఉండదు. ఇక్కడ మొర్రో అన్న మాట వాడటం పాత్ర స్వభావాన్నీ, అయిష్టత తీవ్రతరాన్ని తెలియచేస్తోంది. ఐనా ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఆవిడది అమృతహస్తం. ఉప్మా చేసిందంటే చివరి బొంబాయి రవ్వ పిసరు కూడా ప్లేటులో ఉంచకుండా నాకేయ్యాల్సిందే. ఆవిడ సదరు గృహిణి భర్తగారిని ఏ విధంగా పేంపర్ చేస్తూ రుచికరంగా వడ్డి వారుస్తారో తెలుస్తోంది అమృతహస్తం అన్న పదం వలననే. తను పూరీ, కూర చెయ్యమని అడుగుతాడు. ఆవిడ ఇడ్లీ ఎదర పెడుతుంది.తను పెసరట్టు కాస్త అల్లం,జీలకర్ర, పచ్చిమిరపకాయలు దట్టించి వెయ్యమని అడుగుతాడు. ఎక్కడ ఉపవాసి, ఎక్కడ రుచులు ఆస్వాదించే వాగీశం, నలభీముల్ని సైతం జిహ్వాలూరించేటట్లు వండి పెట్టగల ఇల్లాలు.

మరో కథ విజయ గొల్లపూడి అనే నేను రాసిన 'మనోనిబ్బరం' లో ...మనసులో కరుణ అనుకుంది. ఏమిటో! నా మనసును నేను పాజిటివ్ ఆలోచనలతో నింపుకోవాలని అనుకుంటాను. కానీ ఆ పాజిటివ్ సెన్స్ బ్లడ్ టెస్ట్ రిజల్ట్ విషయంలో ఉండకూడదని పాపం నా పిచ్చి మనసుకు తెలియదు. అవును మరి బ్లడ్ టెస్ట్ రిజల్ట్ ఎపుడూ నెగెటివ్ వస్తేనే హమ్మయ్య ఫరవాలేదు. నాకేం రోగం లేదు అనుకుని తృప్తి పడతాము. పాజిటివ్, నెగెటివ్ అన్న మాటలు అచ్చ తెలుగులో వాడే సందర్భం కాదు. ఈ ఆంగ్ల మాటలలో పాజిటివ్ అంటే ఒక ఆశావహ దృక్పథం, ఆలోచనలు మనసులో కలిగిన సందర్భంలో వాడినవి. ఆరోగ్యం విషయంలో టెస్ట్ రిజల్ట్ అన్నీ నెగెటివ్ గానే రావాలి.అందునా ఈ కరోనా కాలంలో పాజిటివ్ కన్నా నెగెటివ్ మాటే ఇంపు.

ఇంక చివరిగా నవ్వుల రారాజు చిట్టెన్ రాజుగారి హాస్య కథలు చదవటం నాకొక టీ త్రాగటంలాంటి మంచి అలవాటుగా మారింది. వారి కథలు చదువుతూంటే అక్కడ ఎదురుగుండా నిజమైన దృశ్యం కనపడుతుంది. ఆయన ఎంచుకునే పదజాలం, గుప్పించే భావావేశం చదివే పాఠకుడిని కథ అసాంతం చదివేలా చేస్తుంది. కవిత్వంలో హాస్యం - ఆ వోదురూ బడాయి ఆయన కథకి నామకరణం పెట్టడం చూస్తేనే పాఠకుడికి గిలిగింతలు పెడుతుంది. వంగూరి చిట్టెన్ రాజుగారి కొన్ని కథల పేర్లు

అమర భ్రమరావతి, అమెరికారు టోయుట, భరణీ- బ్రహ్మానందం, అమెరికిచెన్, అమెరికోర్టులు-కారాగారాలు, అమెరికారుకూతలు-కోతలు.

ఇక్కడ కథ పేరు కవిత్వంలో హాస్యం - ప్రక్కనే పంచ్ ఆ వోదురూ బడాయ్ అని. ఇక కథలోకి వెడితే ఉగాది సమయంలో కొంతమంది కవులకి నిద్ర మెలుకువ వస్తుంది. రాగానే ఎక్కడెక్కడ కవి సమ్మేళనాలు జరుగుతున్నాయా అని దుర్భిణీ వేసి వెతికేసి అర్జంటుగా అరడజను ఉగాది కవిత్వాలు అల్లేసి ఆయాసభల్లో పట్టు పంచెలు కట్టుకుని చదివేసి మళ్ళీ ఇంటికొచ్చి నిద్రపోతారు. దుర్భిణి అన్న పద ప్రయోగం ఎంత చక్కగా ఉంది. తెలుగు భాషా ఉన్నతికి, నేర్చుకునేవారికి ఒకకొత్త పదం కావచ్చు. శ్రీ చిట్టెన్ రాజుగారి కథ రోజుకోటి చదివినా ఒక హాస్య గుళిక లాగ ఉంటుంది. పద పరిధి కూడా పెరుగుతుంది. భావావేశం కలిగినపుడు,భావప్రకటనకు,కథారచన చేసేటపుడు ఏ పదం ఏ సందర్భంలో వాడుకోవాలో సంకటమే రాదు అత్యధిక పదాలు తెలిస్తే ఒక ఇష్టత ఏర్పడి పదాలు కొలువు తీరి నేనంటే నేను అని పోటీపడుతూ రచనలలో పొందుపరచమని సందడి చేస్తాయి.

ఏడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో సమర్పించిన ప్రసంగ వ్యాసం. వారి సౌజన్యంతో మీకు అందిస్తున్నాము.

❖❖❖❖❖





తెలుగు వాహిని పాఠకులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

# స్వామి వివేకానంద సూక్తులు



- రోజుకు ఒక్కసారైన మీతో మీరు మాట్లాడుకొండి లేకపోతే ఒక అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని కోల్పోతారు.
- నీ వెనుక ఏముంది...ముందేముంది... అనేది నీకనవసరం నీలో ఏముంది అనేది ముఖ్యం.
- మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి, బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి.
- ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్ని నాశనం చేస్తుంది.
- జీవితంలో ధనం కోల్పోతే కొంత కోల్పోయినట్టు కానీ వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్టే.
- ఏ పరిస్థితులలో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరుగుతాయి.
- ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం, ఇది విజయాన్ని కాంక్షించే వారి ప్రాథమిక లక్షణాలు.
- విజయం కలిగిందని విర్రవీగకు, అపజయం కలిగిందని నిరాశపడకు. విజయమే అంతం కాదు, అపజయం తుది మెట్టు కాదు.
- తనను తాను చిన్నబుచ్చుకోవడం అన్ని ఇతర బలహీనలకంటే పెద్ద బలహీనత, తనను తాను ద్వేషించుకోవడం మొదలుపెట్టిన వ్యక్తికి పతనం తప్పదు.
- లేవండి! మేల్కొండి! గమ్యం చేరేవరకు విశ్రమించకండి.

❖❖❖❖❖

## తెలుగువాణి

### *Radio 2TripleO FM 98.5MHz*

*8 -10AM on Saturday – Sydney Time*
*2.30 -4.30 AM on Saturday - India Time*
*(Please check for equivalent Local time@ your place)*

*Listen to Teluguvani on Radio 2Triple O FM 98.5MHz or DAB 985 or Listen audio by dialing: +61 2 8080 5650 Or Tunein App on Android / iPhone*

*Follow the links below :*

*https://Radio2tripleo.com.au*
*http://s7.viastreaming.net/8500/m*
*https://www.facebook.com/telugu.vani.52*

ఈవారం ప్రశ్న సమాధానం: *Please click the link below: https://www.sydneytelugu.org/resources/evaram-prasna*


*Mrs Raja Tallapragada – Convener*

*Mr Chandrasekhar Raghavaraju -Coordinator*

*Mr Sai Gollapudi - Coordinator*

*For sponsorship and other details contact : Convener on 0422 953 668 or*

*Email: vani@sydneytelugu.org*


❖❖❖❖❖






❖❖❖❖❖


INDIAN CUISINE
blu ginger
CANBERRA
Address: 5 Genge St,
Canberra ACT
Phone: (02) 6247 2228
http://www.bluginger.com.au
We Do Catering For All Ocassions
Like us on
(A Group of BluGinger Pty Ltd)

❖❖❖❖❖


Private courtyard available upto 50 people
Catering available
Royal Paradise Biryani
Royal Paradise Biryani
02 9763 5282
reservations@royalparadisebiryani.com.au
14 George Street North Strathfield
NSW 2137.

-డా. పద్మ మల్లెల, సిడ్నీ



## వర్ణం 2

గత సంచికలో మొదలు పెట్టిన వర్ణం అనే సంగీత రచన యొక్క మిగిలిన వివరాలను తెలుసుకుందాం. వర్ణం ప్రధానంగా తాన వర్ణం, పద వర్ణం అని 2 రకాలని తెలుసుకున్నాం కదా! తాన వర్ణం సంగీత కచేరీలకు ముఖ్యమైతే పదవర్ణాలు నాట్య ప్రదర్శనలకు ముఖ్యం అనుకున్నాం కానీ ఈ విభజన ఎలా వచ్చింది అనుకుంటే మన కళలన్నీ పూర్వం రాజ స్థానాలలోనూ, దేవాలయాల్లోనూ వర్ధిల్లిందనడంలో సందేహం లేదు కదా. కనుక ఈ రాజా స్థానాల్లో నాట్య కళకు ఎక్కువ ప్రోత్సాహం కలిగి పదవర్ణాలకు ముఖ్య స్థానం ఏర్పడింది. ఇంకొక రకంగా చారిత్రకంగా చూస్తే భక్తి movement తో మధుర భక్తి అనే అంశం వచ్చి జయదేవ అష్టపదులు, అన్నమా చార్యుల వారి అనేకానేక శృంగార సంకీర్తనలు మరియు క్షేత్రయ్య పదాలు ఆవిర్భవించాయి. అయితే వీటిలో అష్టపదులు, అన్నమయ్య సంకీర్తనలు ఆయా వాగ్గేయ కారులు వారి కృతులను దేవుడికే సమర్పించగా క్షేత్రయ్య కొన్ని పదాలను నాయిక, నాయక భావంతో రాజాస్థానాలలోరచించటం నరస్తుతి గా రచించటం జరిగింది. ఈ విధంగా వారి స్ఫూర్తి తో తరువాతి వాగ్గేయ కారులు ఈ పద వర్ణాలను నాట్యాభిన యానికి అనుగుణంగా శృంగార రచనలుగా క్షేత్రయ్య పదాల కోవలో విలంబ లయ లో అంటే slow tempoలో రూపు దిద్దుకొని నాట్యప్రదర్శనలో ఒక అవిభాజ్య స్థానం పొందాయి. ఒక నాట్య అరంగేట్రం అంటే ఒక నాట్య విద్యార్థి యొక్క ప్రథమ ప్రదర్శనలో ఈ పదవర్ణానికి అతి విశిష్ట స్థానం ఉంది. మామూలు తాన వర్ణంలో లాగా పద వర్ణంలో కూడా పూర్వాంగం మరియూ ఉత్తరాంగం అనే విభాగా లుండి అన్ని విభాగాలకు స్వర సాహిత్యాలు ఉంటాయి. మామూలు తాన వర్ణం పాడే లేక వాయించేటప్పుడు ఎలా పూర్వాంగం రెండు కాలాలు పాడి ఉత్తరాంగం మధ్యమ కాలంలో ప్రదర్శింప పడుతుందో పద వర్ణాలు కూడా అలాగే ప్రదర్శింప బడుతాయి కానీ విలంబలయ లో ఉంటాయి. కానీ కొన్ని సంగీత కచేరీలలో ప్రదర్శింపబడే పదవర్ణాలు మరీ విలంబ లయలో కాక మామూలు తానవర్ణాల కాలప్రమాణంలోనే పాడబడతాయి. సాధారణంగా వర్ణాలు ఆదితాళంలో ఉంటాయి. కానీ వర్ణాలు రచింపబడే ఇంకొక తాళం అతిముఖ్యమైనది ఖండజాతి అట తాళం. ఈ అట తాళ వర్ణాలకు సంగీత ప్రపంచంలో అతిముఖ్యమైన స్థానం ఉంది. సంగీతం లోని ముఖ్యమైన మనోధర్మ సంగీతానికి అతి బలమ యిన పునాదులు ఈ వర్ణాలలో నిక్షిప్త మయి ఉన్నాయనటంలో ఎటు వంటిఅతిశయోక్తిలేదు.

తానవర్ణాలకుకొన్నిఉదాహరణలుగతసంచికలో పద్మవిభూషణ్.డా. బాలమురళీ కృష్ణ గారి విరచితమయినవి వివరింప బడ్డాయి. వారు కాకుండాఆధునికయుగంలోవర్ణాలురచించిన వారిలో శ్రీ లాల్గుడి జయరామన్ గారు, శ్రీ టి.ఆర్.సుబ్రహ్మణ్యం గారు మొదలయిన వారు ప్రముఖులు.

ఇక ముందు తరం లో సంగీత మూర్తి త్రయంలో ఒకరయిన శ్యామశాస్త్రి గారు కొన్ని వర్ణాలు రచించారు తరువాతి వారిలో శ్రీ పట్ణం సుబ్రహ్మణ్యం అయ్యర్ గారు, శ్రీ వీణ కుప్ప య్యర్ గారు, తంజావూరు సోదరులు, మహారాజా స్వాతి తిరుణాల్ గారు మరియు శ్రీ రామ్నాడ్ శ్రీనివాసయ్యంగారు ముఖ్యులు.

ఇంకా వర్ణాలలో చాలా రకాలయిన రాగమాలిక వర్ణాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకి పట్ణం సుబ్రహ్మణ్య అయ్యర్ గారు రచించిన నవ రాగ మాలిక వర్ణం మొదలయినవి. ఇవే కాక వేరే తాళాలలో కూడా చాలా వర్ణాలు రచింప బడ్డాయి.

ఉదాహరణకి క్రితం సంచికలో పేర్కొనబడ్డ శ్యామశాస్త్రుల వారి వర్ణం తిశ్ర జాతి మత్య తాళం లోరచింపబడి ఉంది. ఇక వర్ణాల తరువాత సంగీత రచనలు కీర్తనల గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాం.

ఇప్పుడు మనం ప్రస్తావించుకునే కీర్తన పరంపరలో ధనుర్మాసం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని అన్నమయ్య కీర్తన కొలని దోపరికి గొబ్బిళ్ళో అనే సంకీర్తన ప్రస్తావించుకుందాం. దీనిలో వాగ్గేయ కారులు సామాజిక సంక్రాంతి పర్వ దినాలలో జరుపుకునే గొబ్బిళ్ళ పాటను రూపు దిద్దడం గమనార్హం. దానితో పాటుగా కృష్ణావతార మహిమ లను వర్ణించారు. అదెలాగో చూద్దాం.

పల్లవి:

కొలని దోపరికి గొబ్బిళ్ళో యదుకుల స్వామికి గొబ్బిళ్ళో.

కొలని దోపరికి అంటే గోపికల వస్త్రాపహరణ చేసిన యదుకుల స్వామి అయిన కృష్ణునికి గొబ్బిళ్ళో అంటే గొబ్బెమ్మ రూపం లో బాలకృష్ణుని గోపికలను కొలవటం అన్నమాట.

చరణం:

కొండ గొడుగుగా గోవుల గాచిన |

కొండొక శిశువుకు గొబ్బిళ్ళో |

దుండగంపు దైత్యుల కెల్లను తల |

గుండు గండనికి గొబ్బిళ్ళో || కొలని||

చరణం:

పాప విధుల శిశుపాలుని తిట్టుల |

కోపగానికిని గొబ్బిళ్ళో |

యేపున కంసుని యిడుమల బెట్టిన |

గోప బాలునికి గొబ్బిళ్ళో || కొలని||

చరణం:

దండివైరులను తరిమిన దనుజుల |

గుండె దిగులునకు గొబ్బిళ్ళో |

వెండిపైడి యగు వేంకట గిరిపై |

కొండలయ్యకును గొబ్బిళ్ళో || కొలని||

పై కీర్తన ఆసాంతం మనకి బాలకృష్ణుడి లీలలు గోచరిస్తాయి. ఈ గొబ్బిళ్ళ పాట మధుర గాయని శ్రీమతి పి. సుశీల గళంలో క్రింది లింకు ద్వారా విని ఆనందించండి.

https://www.youtube.com/watch?v=2dkGYE6nI84

❖❖❖❖❖

WESTMEAD
DOCTORS

GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

ONSITE PATHOLOGY



**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE




**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing

OPEN 7 DAYS

New Medical Centre at
# Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au

## వాహిని ఈ మాసపు ప్రశ్నావళి

**'తెలుగు వాహిని'** మాసపత్రికలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినవారిలో **ఒకరికి Just Cakes** వారిచే $25 విలువ గల Gift Voucher కానుకగా అందించబడుతుంది. సమాధానాలు Vahini@sydneytelugu.org e-mail కు జనవరి 28 వ తేదీలోగా **పంపగలరు.**

**ఈ మాసపు ప్రశ్న:**

**సిడ్నీలోని ఒక దేవాలయం పేరు, వివరాలు రెండు వాక్యాలలో మీ సమాధానాన్ని తెలుగు లిపి లో పంపండి.**




**'బుడుగు' సృష్టికర్త బాపు గారి అసలు పేరు ఏమిటి?**

జవాబు:

**శ్రీ సత్తిరాజు లక్ష్మీనారాయణ**

శ్రీమతి జానకి వనం, హైద్రాబాద్

❖❖❖❖❖

## వాహిని పాఠకుల స్పందన

మహానటి సావిత్రిగారి ముఖ చిత్రంతో వాహిని సుందరంగా ఉంది... కొరోనా అందరి జీవితాలలో చీకటి నింపింది... శార్వరి పేరు సరిగా సరిపోయింది... ఒక రకమయిన నిర్లిప్తతత అందరిని ఆవహించింది... మీరు చెప్పినట్లుగా సంగీత సాహిత్యాలతో అంతర్జాలంలో కొంత మార్పు చోటు చేసుకుంది... సంపాదకీయం ఆలోచనాత్మకంగా వుంది...

శ్రీ పెయ్యేటి రంగారావుగారి భగవద్గీతలో శోకరాహిత్యమే గీత యొక్క పరమ లక్ష్యమని వివరించడం బాగుంది... బాధ కొంత మేరకు మాత్రమే తగ్గుతుంది... బుద్ధికి అతీతమయిన ఆత్మ గురించి తెలియజేయడం ఒక రకమయిన జ్ఞానాన్ని పంచినట్లుగా ఉంది...

పట్టు చీరలు ఎలా భద్రపరుచుకోవాలో అనురాధగారు మంచి ఉపాయం అందించారు...

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవిగారి 'ఉత్తరాల స్టాండు' మమ్మల్ని గతంలోకి తీసుకెళ్ళింది... ఉత్తరాల కోసం ఎదురుచూసిన నాటి ఉద్విగ్నత గుర్తుకొచ్చింది...

శ్రీమతి లలిత రాంబట్ల గారి 'ధనుర్మాస వైశిష్ట్యం, అందరూ ఆచరించటానికి వీలుగా బాగా చెప్పారు...

శ్రీ వంశీ రామరాజుగారు 'ఘంటసాల గుడి' కనులకు కట్టినట్లుగా వ్రాసారు... ఆ గుడిని, అక్కడ నిత్యం జరిగే పూజలు ప్రత్యక్షంగా వీక్షించిన నాకు వంశీగారి సేవలు, అపురూపంగా అనిపించింది... ఘంటసాలగారి గురించిన ఎన్నో విషయాలు వారు తెలిపిన విధానం బాగుంది... '51 రోజుల స్వర రాగ యాగం' నిర్వహించడం చాలా గొప్పగా ఉంది... ఘంటసాలగారి దైవత్వాన్ని చాటి చెప్పే విధంగా ఉంది...

గజల్ అంటే పదాల్లో 'అగ్నిని దాచిపెట్టడం' ఈ వాక్యం నాకు బాగా నచ్చింది...

'జీవితం నందన వనం కాదు... నందన వనంలా చేసుకోవాలి' అనే బాలుగారి ఆలోచనలకు అక్షర రూపం ఇచ్చిన శ్రీ కోడూరి రామమూర్తిగారు, బాలుగారిపై వ్రాసిన కథానిక చాలా బాగుంది... బాలుగారి గురించిన ఎన్నో విషయాలు చదువుతుంటే, వారిని తలుచుకుని చాలా బాధ కలిగింది...

'శ్రీధర వెంకటప్పయ్య' సమయ స్ఫూర్తి వెలికి తీసిన ప్రయత్నం బాగుంది... శ్రీ పెయ్యేటి రంగారావుగారికి అభినందనలు...

శ్రీ వంగూరి చిట్టెన్ రాజుగారి 'పరిశుభ్ర గొట్టాల కథ' చదివి ఆద్యంతం హాయిగా నవ్వుకున్నాము...

వాహినిలో అన్ని రసాలను సమపాళ్ళలో అందిస్తున్న నిర్వాహకులకు అభినందనలు మరియు ధన్యవాదాలు...

శ్రీమతి డి కామేశ్వరిగారి 'మహిమ' ధారావాహికం ఆసక్తికరంగా సాగుతోంది...

మానవత్వానికి చిరునామా వెతుకుతున్న రోజుల్లో ఒక చక్కటి మార్గం చూపించిన శ్రీమతి విజయగారి కథనం బాగుంది...

**శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్**

**గత రెండు సంవత్సరాలుగా నా వ్యాస మాలికలను ప్రచురిస్తున్న సిడ్నీ తెలుగు అసోసియేషన్ ద్వారా నిర్వహించు తెలుగు వాహిని మాస పత్రిక నిర్వాహకురాలు శ్రీమతి విజయ గొల్లపూడి గారికి హృదయ పూర్వక ధన్యవాదములు.**

**పాఠకులందరికీ 2021 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు.**

**శ్రీమతి పద్మ మల్లెల, సిడ్నీ**

❖❖❖❖❖

## చిత్రకళ-చిద్విలాసా...శ్రీ శ్రీనివాసా!

-శ్రీమతి ప్రసూన రవీంద్రన్, హైద్రాబాద్




❖❖❖❖❖






❖❖❖❖❖


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

# మహిమ సీరియల్ ఏడవ భాగం

-శ్రీమతి డి. కామేశ్వరి, హైద్రాబాద్



సార్‌ని మెప్పించడమంటే ఏమిటో తెలియకుండానే, ఆమె ప్రమేయం లేకుండానే, కాదు లేదు అని చెప్పే వీలు లేకుండానే అన్ని ఏర్పాట్లు చేసేశాడు అన్వర్. ఓ పక్క బెరుకు, భయం, లేదంటే ఉద్యోగం రాదు. వద్దంటే పొమ్మంటారేమో ... ఆమె ఏదీ నిర్ణయించుకోలేని స్థితిలో ఉండగానే సార్‌ని మెప్పించేసింది. అటు వినోద్‌కి ఆశ, కోరిక, ఉద్రేకం, అన్నీ ఉన్నా మొదటి మెట్టు ఎక్కడమే కష్టమయింది. ఓసారి ధైర్యం చేసి కాలుపెట్టాక, ఎలా ఎక్కాలో, ఎక్కి తనకు కావాల్సింది ఎలా పొందాలో, ఏం చేస్తే అమ్మాయిలు లొంగుతారో ... అన్ని కిటుకులు, పాఠాలు అతి త్వరలోనే వంటబట్టించుకుని, ఆ రంగంలో ప్రావీణ్యం సంపాదించడానికి అన్వర్ ఇచ్చిన ప్రోత్సాహం, చేసిన సాయంతో అతని కుడిభుజం స్థాయికి ఎదిగిపోయాడు అన్వర్. ఇల్లు, సంసారం, సమాజంలో పరువు, ప్రతిష్ఠ ఏదీ భంగపడకుండా తనకు కావల్సింది ఎలా అందిపుచ్చుకోవాలో, తన తృష్ణని ఎలా తీర్చుకోవాలో నేర్చేసుకున్నాక బెరుకు, భయం పోయాయి. అంతే ... అతిసహజం అన్నట్టుగా, ఇంట్లో వంట బాగులేకపోతే, చక్కగా రుచిగా వండలేని అసమర్థ భార్యతో గొడవ పడేకంటే, కావల్సింది అప్పుడప్పుడు హోటలుకెళ్లి ఇష్టంగా తినిరావడంలో తప్పేమిటి అన్నంత సహజమైంది ఆ అలవాటు. దానికి తోడు అమ్మాయిలందరూ అందుబాటులో ఉండే ఆఫీసు అవడం మరింత వెసులుబాటు ఇచ్చింది. బాగుందనుకున్న అమ్మాయిని ఎరవేసి పట్టడం అన్వర్ వంతు. ఏర్పాట్లు అన్వర్‌వి. అనుభవం వినోద్‌ది. ఇష్టపడని వాళ్లని బలవంతం ఏముంది అప్లికేషన్ రిజెక్ట్. భవిష్యత్తుని అందంగా ఊహించుకునే అమ్మాయిలు, ఇష్టపడో, దారిలేకో, ఏం పోయింది, ఎవరికి తెలుస్తుంది అని ధైర్యసాహసాలు ఉన్నవారినే ఎంచేవాడు అన్వర్. ఏడాది తిరిగేసరికి వినోద్ ఆ రంగంలో ఆరితేరాడు. ఆఫీసులో కాస్త గుసగుసలు మొదలయ్యాయి. బాస్ గారి లీలలు కొందరు అమ్మాయిలలో ఆశ నింపితే, మరి కొందరు బెరుకుగా తప్పుకుంటూ వెళ్లేవారు. ఆ గుసగుసలు అవినాష్ జైన్ దగ్గరికి చేరాయి. మొదట ఆయనలో కొడుకు చేస్తున్న పని రేపు ఏం

కొంపముంచుతుందో, ఏ అమ్మాయన్నా ఈ గుట్టు రట్టు చేస్తే కంపెనీ పరువు, ఇంటి ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న భయం కలిగించాయి. కొడుకుతో మాట్లాడి గట్టిగా వార్నింగ్ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినా, ఓ పక్క వినోద్‌ని చూస్తే ఆయనకి బాధగానే ఉండేది. పాపం జీవితంలో వాడు ఏం సుఖపడ్డాడు ? ఈ కుటుంబం కోసం, కంపెనీ కోసం వాడి భవిష్యత్తు తాకట్టు పెట్టాడు. డబ్బుకోసం తన ఆనందాన్ని బలిపెట్టాడు. ఒక్కరోజైనా భార్యతో ఏం సుఖపడ్డాడు ? భార్య భర్తగా ఏం గౌరవం ఇచ్చి వాణ్ణి సుఖపెట్టింది, అన్న బాధ ఉంది ఆయనలో. భార్యతో ఎన్నోసార్లు తన మనసులో బాధ చెప్పేవాడు. 'అవునండి, వెర్రినాన్న ... పాపం అందరికోసం వాడు బలయ్యాడు. అందం లేకపోయినా, అణుకువ అన్నా ఉంటే సుఖపడేవాడు'. తల్లిదండ్రులిద్దరూ కొడుకుని చూసి బాధపడడం మినహా ఏం చెయ్యలేకపోయారు. ఇప్పుడు వాడికి కావల్సిన ఆనందాన్ని, కోల్పోయిన సుఖాన్ని అనుభవించనీ అనుకుంది ఆయన తండ్రి మనసు. కొడుకు బదులు అన్వర్‌ని పిలిచి హెచ్చరించాడు. 'ఈ విషయం బయటపడితే నిన్ను పాతరేస్తా. జాగ్రత్తగా హ్యాండిల్ చెయ్యి' అన్నాడు. అన్వర్ అర్థమైనట్టు వినయంగా తల ఆడించాడు.

వినోద్ జీవితంలో ప్రీతి తారసపడేవరకు, అతని రిలేషన్‌షిప్‌లన్నీ ఒక రాత్రి, ఒక వారం, మహా అయితే ఒక నెల తప్ప అతన్ని కట్టిపడేసే, సమ్మోహపరిచే బంధం తటస్థపడలేదు.

మిగతా ఆడపిల్లలకి, ప్రీతికి చాలా తేడా కనిపించింది వినోద్‌కి. అంద చందాలను మించి ఆమెలోని ఆకర్షణ, ఆమెలోని జాణతనం, సోఫిస్టికేషన్, మాటల్లో హాస్యచతురత, తెలివిగా కౌంటర్ ఇవ్వడం, అతన్ని ఊపిరి సలపని అనురాగంలో ముంచెత్తి ... తను వెతికింది ఇలాంటి తోడుకోసం, ఇలాంటి పొందుకోసం అనుకొని అల్లాడాడు. భావుకత, సౌందర్యం, నిజమైన ప్రేమను ఆమె దగ్గర పొందాడు.

తల్లిలా ఆదరించి ఆకలి కనిపెట్టి, ఇల్లాలిగా అనురాగం, దాసిలా సేవ,

మంత్రిగా సలహా, ఒక స్త్రీలో పురుషుడు కోరుకునేవన్నీ ప్రీతిలో కనిపించాయి. ఇద్దరి భావాలు, వేవ్‌లెన్త్ కలిసి ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకుని, చర్చించగల తెలివి ఆమెలో చూసి, ఆమెలో అన్ని గుణాలకి సరెండర్ అయిపోయి, 'తను కోరుకున్న స్త్రీ దొరికింది' అని తృప్తిగా ఇంకో అమ్మాయి వైపు కన్నెత్తి చూడని అనుబంధం ఇద్దరి మధ్య ఏర్పడింది. తోటి అమ్మాయిలతో కలిసి ఉండే ప్రీతిని ఎప్పుడుబడితే అప్పుడు కలిసే వీలులేక, తమ ఇద్దరికి ప్రైవసీ కోసం, తమ రాకపోకలు ఎవరికంటా పడకుండా ఉండడం ప్రీతిని తన తాహతుకు సరిపోయే అపార్ట్‌మెంట్ అద్దెకి తీసుకుని షిఫ్ట్ చేశాడు. ఇద్దరూ ప్రణయ సామ్రాజ్యాన్ని ఏలుతూ, పరిసరాలనే మరిచిపోయారు. ప్రీతిని యాడ్ వరల్డ్‌లో స్టార్‌ని చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేసి, పేరు, డబ్బు సంపాదించుకుని తనకో గుర్తింపు తెచ్చుకునేట్టు చూశాడు. ప్రీతితో తన సంబంధంఎంత గుట్టుగా ఉంచినా, ఇలాంటివి ఎక్కువ రోజులు దాచలేరు అన్నది నిజమైంది. ప్రీతి వేషభాషలు, రిచ్‌నెస్, వేరే అపార్ట్ మెంట్ తీసుకోవడం, ఇవన్నీ మిగతా అమ్మాయిల దృష్టి నుంచి తప్పించలేక పోయాడు. వినోద్, ప్రీతి బాడీ లాంగ్వేజ్, ఒకరిని చూసి ఒకరి మొహంలో, కళ్ళలో కనపడే ప్రేమోన్మాదం అందరికీ అర్థమవసాగింది. కొడుకులో మార్పు అర్థమై అన్వర్‌ని పిలిచి విషయం ఆరా తీశాడు అవినాష్. తర్వాత కొడుకుని పిలిచి శ్రేయోభిలాషిగా, తండ్రిగా ఇలాంటి రిలేషన్‌షిప్‌లు ఎలాంటి అనర్థాలకి దారితీస్తాయో చెప్పి హెచ్చరించాడు. "నీవిన్నాళ్లు ఏం చేసినా, తెల్సినా నిన్ను ఏమనలేదు. జీవితంలో అనుభవానికి రానిది కొన్నాళ్లు అనుభవించనీ అనుకున్నాను. అప్పుడప్పుడు అటాచ్‌మెంట్‌లు లేని అనుభవాలు ఫరవాలేదు. కానీ రేపు నీ భార్యకి తెలిస్తే చాలా చిక్కులు వస్తాయి. తెలిసి ఏ భార్యా సహించదు. ఆఫీసులో నీ గౌరవం, మర్యాద, కుటుంబ పరువు అన్నీ ఆలోచించు" నచ్చచెబుతూ అన్నాడు. అన్నీ మౌనంగా విన్నాడు వినోద్, తలవంచుకుని. తరువాత తలెత్తి తండ్రికి రెండు చేతులతో దండం పెట్టాడు. "డాడీ, ప్లీజ్! ఇన్నాళ్లకి నాకు దొరికిన ఈ ఆనందం, తృప్తిని

వదలలేను. కొన్నాళ్లయినా నన్ను సంతోషంగా బతకనీయండి. నా జాగ్రత్తలో నేనుంటాను" అన్నాడు. కొడుకు వంక చూసి, ఆయన ఇంకేం అనలేక మౌనం వహించాడు.

ఒక ఆరునెలలు ప్రీతి సాంగత్యంలో సర్వం మరిచి ఓలలాడాడు. ప్రీతికి ఎన్నో ప్రకటనల ఆఫర్లు, యాడ్‌ఫిలిమ్స్, చిన్న చిన్న షార్ట్‌ఫిలిం ప్రకటనలతో తీరిక లేకుండా పోయింది. చేతినిండా డబ్బు, ఇంటినిండా సామాను, రకరకాల డ్రెస్సులు, ఫ్యాషన్‌షోలు... తన సమర్థత మీద తనకి విపరీతమైన నమ్మకం, మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ప్రీతిలో అహంకారం పాలు ఎక్కువయింది. వినోద్ తనవాడు, తనని వదిలిపోయే ప్రసక్తిలేదన్న నమ్మకంతో వినోద్‌ని సొంతం చేసుకో వాలన్న ఆలోచన మొదలైంది. ఈ యాడ్ వరల్డ్, ఫ్యాషన్ వరల్డ్‌లో ఈనాటి ఆకర్షణ, అందం, ఎన్నాళ్లో అందరినీ ఆకర్షించలేదు. కొత్త మొహాల కోసం వెతుకులాట, పాతవారిని చిత్తుకాగితంలా బుట్టలో పడేస్తారన్న నిజాలు చుట్టూ చూసి తెలుసుకుంది. తన భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే వినోద్ అండ వదులుకోకూడదు. అతను తనకు సొంతం అవడానికి ఏం చెయ్యాలో దారులు వెతికింది. తనకోసం అద్దెకి తీసుకున్న అపార్ట్‌మెంట్ కొనిపించింది. డబ్బు ఖర్చు పెట్టి ఆ మాత్రం చేయడం వినోద్‌కి సమస్య కాదు. కానీ ఈమధ్య తరచు ప్రీతి తనను ఇబ్బంది పెట్టే కోరికలు కోరుతోంది. అతి ప్రేమతో అల్లుకుపోతూ "వినోద్, నువ్వు శాశ్వతంగా నావాడివి కావాలి. నాకెందుకో నువ్వు నన్ను వదిలి పోతావన్న భయం వేస్తోంది డియర్. ఇలా ఎన్నాళ్లు ఈ బంధం నిలుపుకోగలం. ఈ దొంగచాటు బతుకు ఎన్నాళ్లు ? వినోద్ నన్ను పెళ్ళిచేసుకో. అప్పుడే నాకు నిశ్చింత. ఈ బెంగతో రాత్రిళ్ళు నిద్ర కూడా పట్టడం లేదు. నీవెప్పుడు వస్తావోనని ఎదురు చూపులు, రాని రోజున ఆ నిరాశ తట్టుకోలేక ఏడుపు వస్తుంది. ఆ వియోగం తట్టుకోలేకపోతున్నాను ..." గుండెలమీద తలపెట్టి కన్నీరు పెట్టుకుంది.

"ప్రీతి డార్లింగ్ ! ఏ రోజన్నా ఏదో టైమ్‌లో రాకుండా ఉంటున్నానా ?

నీకెందుకు అలాంటి అనుమానాలు. డియర్ నీకంటే నాకే నీ అవసరం ఎక్కువ. నిన్ను వదిలి ఉంటున్న క్షణాలన్నీ యుగంలా అనిపిస్తాయి. ఆఫీసులో ఉన్నంతసేపే నేను ప్రశాంతంగా ఉంటాను. ఇంటికెళ్లిన ప్రతిక్షణం నీవు లేని లోటుతో సతమత మవుతున్నా. ఏం చెయ్యగలను ... కొన్ని మన చేతుల్లో ఉండవు. ఉన్నదాంతో సర్దుబాటు చేసుకో. ఉన్నంతలోనే ఆనందాన్ని అనుభవించడం ..." సర్ది చెప్పేవాడు.

"అవును, ఆనందాన్ని అనుభవించడానికి నేను కావాలి కాని సమాజంలో, నీ ఇంట్లో స్థానం ఇవ్వవు. పబ్లిక్‌గా నేను నీదాన్నని గర్వంగా చెప్పుకోలేను. దొంగచాటు బతుకు ఎన్నాళ్ళు వినోద్. నాకు ప్రియుడే భర్త అనుకుంటూ ఎన్నాళ్లు? ఇల్లు, పిల్లలు, సంసారం కావాలనిపించదా" ? అలిగేది. బతిమాలుతూ, విచలితురాలై కంటనీరు పెట్టుకునేది. మొదట్లో వినోద్ ప్రీతి బాధగా అంటుంటే నిస్సహాయంగా, "నేనేం చెయ్యను డార్లింగ్ ... నీలు తెల్సు నేను పెళ్ళయినవాడిని. తండ్రిని. తల్లిదండ్రుల మధ్య బతుకుతున్నవాడిని. సంఘంలో పరువు ప్రతిష్ఠ. మిగతావి అన్నీ ఉంటే ఉండనీ లేకపోతే పోనీ అనుకోగలిగినా, భార్య ఊరు కుంటుందా ... భర్త మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి ..." అని చాలా దిగులుగా అనేవాడు.

"ఏం ఆ పెళ్ళాం లేకపోతే బతకలేవా ? డివోర్స్ ఇవ్వు. ఎలాగూ ఆమెతో ఏ సంతోషం లేదని నువ్వే చెప్పావు. అలాంటి భార్యని పట్టుకుని వేలాడాలా ? ఆమెకి కావల్సిన ఇల్లు, డబ్బు ఇచ్చేయి. విడాకులు తీసుకో ..."

"హు, నీకు తెలీదు. నేనిచ్చే ఇల్లు, డబ్బు తనకెందుకు. తనకే ఉంది నన్ను కొనగలిగే డబ్బు. నిజం చెప్పాలంటే డబ్బుతోనే నన్ను కొనుక్కుంది. ఈ కంపెనీ అంతా తన భిక్ష. అలాంటి భార్యని కాదని నేనెలా అనగలను ..." చాలాసార్లు ఈ విషయం ప్రీతికి నచ్చచెప్పేవాడు. తన అసహాయత వెల్లడించేవాడు. కాని ఉన్నంతసేపు ప్రీతి, కట్టుకున్న భార్యకంటే ఎక్కువగా డిమాండ్లు, అలకలు, కోపాలు, విసుగులు ప్రదర్శిస్తూ అతన్ని విసిగించడం

ఆరంభించింది. ఇంట్లో భార్యతో సుఖం, హాయి దొరక్క వచ్చే వినోద్‌కి, రోజులు గడుస్తున్నకొద్దీ ఆ కొత్తమోజు, ఆ ప్రేమ, ఆ స్వర్గసుఖాలు అన్నీ పాతబడి ప్రీతి దగ్గరికి వచ్చిన క్షణాలు ఆనందం కంటే ఇబ్బంది కలిగించడం ఆరంభించాయి. ఇటు ప్రీతి సాంగత్యం వదులుకోలేక, అటు ఆమె డిమాండ్లని తట్టుకోలేక నలిగిపోయాడు. దాంతో రాకపోకలు తగ్గించడం మొదలుపెట్టాడు. అది ప్రీతిని మరింత ఆగ్రహానికి గురిచేసింది. వచ్చినరోజున మనసారా ఆహ్వానించకుండా నీకు ఆడదాని సుఖం కావల్సిన రోజు వస్తావా, వెళ్ళు. ఇంట్లో భార్య ఉందిగా మరి నేనెందుకు, అంటూ ఎడమొహం పెడమొహం పెట్టి దెప్పేది. ఒకరోజు బతిమిలాడుతూ, మరోసారి ప్రాణం విసిగి, 'సరే, పోతాను. నీకు నా మీద ప్రేమ పోతే ఇంక రానేరాను' అని అతను ఎగిరేవాడు. అప్పుడు 'కాస్త తగ్గాలి. నిజంగా రాకపోతే, అతన్ని వదులుకుంటే నష్టం ఎవరికి ...' అనుకుంటూ మళ్లీ కళ్ళనీళ్లు పెట్టుకుంటూ కౌగిలిలోకి ఒదిగిపోయేది. వినోద్‌ని తనవాడిగా చేసుకునే ఆలోచనల్లో ఒక అద్భుతమైన ఆలోచన అనుకుని ఆచరణలో పెట్టింది. నెలరోజుల తర్వాత వినోద్ రాగానే సంతోషంతో ఎదురెళ్లి కౌగిలించుకుని, "వినోద్ ... నీకివాళ ఎంత శుభవార్త చెప్పబోతున్నానో ఊహించు. ఊహించలేవు. చెప్పాక నాకేం బహుమతిస్తావో ఊహించలేకపోతున్నాను'' అంటూ ఊరించి, బతిమాలించుకుని ... ఆఖరికి సిగ్గు, ఆనందం ఒలకబోస్తూ "వినోద్ మన మధ్య మనకో బిడ్డ ... నీ బిడ్డ ... నా కడుపున ... ఓహో నీ రూపం నాలో ... నాకు ఏం చెయ్యాలో తెలియనంత సంతోషం ...''

వినోద్ కౌగిలి సడలిపోయింది. చటుక్కున ప్రీతిని వదిలేశాడు. అతని మొహం పాలిపోయింది. ఆ తరువాత నల్లబడింది. మరుక్షణంలో ఎర్రబడింది. కలవరంగా, కంగారుగా "ఏమంటున్నావు నువ్వు" ? తడబడుతూ అడిగాడు.

"వినోద్ ... మనిద్దరి ప్రేమసాక్షి ... మనబిడ్డ ..."

"ప్రీతి ..." అరిచాడు. "మతిపోయిందా నీకు. మనకు పిల్లలేమిటి ? ఎలా కుదురుతుంది ? నలుగురికి ఏం చెబుతావు ? మనం భార్యాభర్తలం

కాదు. లోకాన్ని ఏ మొహంతో ఎదుర్కొంటాం ? అసలు నీకు ముందే చెప్పానా లేదా మనిద్దరం చాలా జాగ్రత్తపడాలి ఈవిషయంలో అని. నా భార్యకిది తెలిస్తే చంపి పాతర వేస్తుంది. ఇంట్లో వాళ్ళకి ఏం చెప్పాలి. నీకంటే పెళ్ళికాలేదు. నిన్ను నిలదీసేవారు లేరు. నా పరిస్థితి నీకు తెలుసు. అయినా ఇలా ఎందుకు చేశావు? ఆవేశంగా, ప్రీతి భుజాలు పట్టుకు ఊపేస్తూ అరిచాడు.

ప్రీతి నిర్లక్ష్యంగా అతనివైపు ఓ చూపు విసిరి, "ఇద్దరం కలిసి ఆనందించాం. దానికి నన్ను ఒక్కర్తినే ఎందుకంటావు. పెళ్ళి చేసుకోలేకపోయినా కలిసి కాపురం చేస్తూ పిల్లల్ని కంటే తప్పేమిటి ? నాకు నా బిడ్డ కావాలనుకుంటే తప్పేమిటి ? ఆడదాన్ని ... తల్లినవ్వాలని నాకు కోరికుండకూడదా ? ఎంతసేపటికీ నీ గురించే ఆలోచిస్తావు. నీకు పెళ్ళాం భయం, లోకభయం. కానీ ఆడదాని ఆనందం మాత్రం కావాలి. నాకలా కాదు. నాకు అన్నీ కావాలి. ఇల్లు, సంసారం, పిల్లలు అన్నీ కావాలి. పెళ్ళి కాకపోయినా, ఐడోంట్ కేర్ ..." తనూ గట్టిగా అరిచింది. విస్తుపోయాడు వినోద్. ఏం మాట్లాడాలో తెలియక గాభరా పడిపోయాడు.

"ఏమిటాచూపు ... లోకంలో పిల్లల్ని కనబోతున్న మొదటి ఆడదాన్ని నేనే అన్నట్లు" దబాయించింది.

వినోద్ విసురుగా లేచి, ఆవేశంగా, "మాట్లాడకు. ముందు వెళ్ళి డాక్టర్ని కలువు. ఏం చేస్తావో, ఎలా చేస్తావో ... ఈ బిడ్డ లోకంలోకి రాకూడదు అంతే" కచ్చితంగా తెగేసి అన్నాడు.

ప్రీతి విస్తుపోయింది. వినోద్‌లో అంత కోపం ఎన్నడూ చూడని ఆమె కలవరపడుతూ, "ఏమిటి వినోద్ ? ఏమంటున్నావు" ?

"వెళ్ళి వెంటనే అబార్షన్ చేయించుకోమంటున్నా" చాలా గట్టిగానే అన్నాడు. ప్రీతి మొహం ఎర్రబడి పోయింది. వినోద్ ఇంత రూడ్‌గా ప్రవర్తిస్తాడని, ఇలా తెగేసి మాట్లాడుతాడని ఊహించని ఆమె బిత్తరపోయింది. తన ప్లాను బెడిసి

కొట్టినందుకు, తన ఆశ వమ్ము కాబోతున్నందుకు, ఆ నిరాశ తట్టుకోలేక ఆఖరి అస్త్రంగా "వినోద్, ఈ బిడ్డ నాక్కావాలి. అందుకు నేనొప్పుకోను. అబార్షన్ చేయించుకోను" నిష్కర్షగా అంది.

ప్రీతి అంత నిర్లక్ష్యంగా తనను, తన మాటలను లెక్కచెయ్యకపోవడంతో వినోద్‌లో ఆగ్రహం పెల్లుబికింది. విసురుగా లేచాడు. "సరే, బిడ్డని కంటావో మానతావో నీ ఇష్టం. ఈరోజు నుంచి నీకు నాకు సంబంధం లేదు. ఇంక నీ మొహం నేను చూడను. గుడ్‌బై !" ఆఖరి అస్త్రం వదిలాడు.

ప్రీతి విసురుగా లేచి అతని చెయ్యి పట్టి లాగి, "ఏమిటి గుడ్ బై ? ఆ ... ఇన్నాళ్లు వాడుకుని నన్ను వదిలేసిపోతావా ? నా గర్భం నీ ఆనందానికి అడ్డని, ఈ బిడ్డ వల్ల నీ పరువు ప్రతిష్ఠలకి భంగమని వదిలించుకు పోదామను కుంటున్నావా"? అపరకాళి అవతారం ఎత్తి అంది.

"ప్రీతీ ... అర్థంచేసుకో, నా మాట వింటే మనం ఇలాగే ఉండొచ్చు. కాదంటే ... నేను నా పరువు ప్రతిష్ఠని తాకట్టుపెట్టలేను. ఈ విషయం నా భార్యకి తెలిస్తే ఊరుకోదు. నన్ను నిలదీసి అడిగే హక్కు ఆమెకు ఉంది".

"నిన్నేమన్నా నీ భార్యగా ఇంటికి తీసికెళ్లమన్నానా లేక నీ పెళ్ళాం స్థానం ఇమ్మన్నానా ? లేకపోతే నీ భార్యని వదిలేయమన్నానా ? మనం ఏ గుళ్లోనో పెళ్ళి చేసుకుందాం. పుట్టబోయే బిడ్డకు తల్లిదండ్రులం అవుదాం. ఇదే కదా నేను అడుగుతోంది" ప్రీతి కోపంగా అంది.

"ఇదిగో ప్రీతీ, మన విషయం ఎంతో జాగ్రత్తగా ఎవరికీ తెలియకుండా ఇన్నాళ్ళు ఎలాగో సాగించాను. ఇప్పటికే ఆఫీసులో చాలామంది గుసగుసలాడు తున్నారు. బాస్‌ని కనక పైకి తెలియనట్టే ఉంటున్నారు. ఈ విషయం ఇవాళ కాకపోతే రేపయినా నా భార్య దగ్గరికి చేరుతుంది. ఏదో విధంగా దబాయించో, అబద్ధాలు చెప్పో, ఎలా తప్పించుకోవాలో అర్థంకాక భయపడుతున్నాను. ఇలా నీ మెడలో తాళికట్టి పిల్లాడిని కంటే, ఆవిడ ఊరుకుంటుందా ? సమాజం,

చట్టం అంతా ఆవిడవైపే ఉంది అది మర్చిపోకు. అసలు నీకు నేను పెళ్ళిచేసుకుంటానని ఎప్పుడన్నా చెప్పానా ? ముందురోజే నా పరిస్థితి చెప్పాను. ప్రేమకు, అనురాగానికి నోచుకోని నేను అవి దొరికే స్త్రీ పొందు కోరుకున్నాను. నువ్వు నాకు నచ్చావు కనుక నీతో సహజీవనం చేశాను. అంతకుముందు అమ్మాయిలతో రోజులు, మహా అయితే ఒక నెల ... అంతకంటే ఎక్కువ ఎవరితోనూ ఇలాంటి పొత్తు పెట్టుకోలేదు. ఇవన్నీ నీకు ఏదీ దాచకుండా ముందే చెప్పాను. నువ్వు అన్నింటికీ ఇష్టపడే, నన్ను నిజంగానే ప్రేమించావని నమ్మాను. నిన్ను గత ఏడాదిగా ఎంత అపురూపంగా చూసుకున్నాను. నువ్వు ఏదడిగినా కాదనకుండా సమకూర్చాను అపార్ట్‌మెంట్, కారు, నీకు నటిగా, మోడల్‌గా గుర్తింపు తెచ్చే అవకాశాలు ... ఎన్ని ఇచ్చా. ఇవన్నీ నేను ఇష్టపడే చేశాను. మరి నువ్వు నన్ను నిజంగా ప్రేమించావో, నీ స్వార్థం కోసం ప్రేమ చూపావో, ఈ ఫ్యాషన్ వరల్డ్‌లో నీ స్థానం కోసం నన్ను వాడుకున్నావో నాకు తెలియదు. తల్లికావాలి అనే నీ కోరికని నేను తీర్చలేను. ఆ బిడ్డకి తండ్రిగా ఉండలేను. నా మాట అంగీకరిస్తే మన సంబంధం కొనసాగుతుంది. లేదంటే నన్ను మర్చిపో. ఇదే నా ఆఖరి మాట. ఆలోచించి, ఏ సంగతీ రేపు చెప్పు. నన్నేదో బ్లాక్‌మెయిల్ చేద్దామని మాత్రం అనుకోకు" అన్న వార్నింగ్ కూడా ఇచ్చి చకచకా వెళ్లిపోయాడు వినోద్.

నిర్ఘాంతపోయి కూలబడిపోయింది ప్రీతి. మొహం ఎర్రబడి, కళ్లు నీళ్లతో నిండిపోయాయి. తన ఆశ, కోరిక తీరేది కాదని వినోద్ ఖచ్చితంగా చెప్పేశాడు. జీవితాంతం ఇలా అతని ఉంపుడుగత్తెగా ఉండిపోవాలా ? పెళ్ళి, సంసారం, పిల్లలు లేకుండా గడపాలా ? ఇవాళ ఉన్న ఈ ప్రేమ ఎన్నాళ్లుంటుంది ? ఈ ప్రేమని నమ్ముకుని ఎలా బతకాలి ? పెళ్ళి లేని ప్రేమకి మగాడు కట్టుబడడు. ఈ సంఘటన తర్వాత అతను ఇదివరకటి ప్రేమ చూపకపోవచ్చు కూడా ! ఇంక ఇది మూన్నాళ్ల ముచ్చటే అవగలదు. తను అతన్ని కాదని బిడ్డని కంటే, పెళ్ళి కాకుండా బిడ్డను కన్న తనను లోకం గౌరవిస్తుందా ? వినోద్‌తో సంబంధం

తెంచుకుంటే రేపు తనకి అవకాశాలు తగ్గవచ్చు. ఏ ధైర్యంతో తను ముందుకెళ్లగలదు ? రాత్రంతా ఆలోచించినా పరిష్కారం కనబడలేదు. మనసులో కోపం, కసి పెరిగిపోయి, ఇన్నాళ్ల తనను వాడుకుని వదిలేశాడన్న ఉక్రోషంతో రాత్రంతా నిద్రపట్టక దొర్లింది. మర్నాడు ఫోన్ చేస్తానని, కోపం తగ్గి వస్తాడని ఆశించింది. ఒక రోజంతా చూసి తనే ఫోన్ చేసింది.

"ఏం నిర్ణయం తీసుకున్నావు" ముభావంగా అడిగాడు.

"ఇంకా ఆలోచించలేదు" బింకంగా అంది. ఫోను టక్కున పెట్టేశాడు.

మూడు రోజులు అదే పరిస్థితి. ఫోన్ చేసినా కట్ చేసేవాడు. మెసేజ్ పెడితే 'నిర్ణయం మార్చుకుంటే తప్ప మాట్లాడకు' అని జవాబిచ్చాడు. అతని నిర్లక్ష్యం ఆమెలో మరింత కోపం, కసి, ఉక్రోషాన్ని పెంచాయి.

అసలు తన గురించి ఏమనుకుంటున్నాడు. ఇష్టం వచ్చినట్టు వాడుకుని వదిలేసిపోతే, ఊరుకుంటానని అనుకుంటున్నాడా ? ఏం చెయ్యలేనని ధైర్యమా? ఒకరకం తెగింపు వచ్చింది ప్రీతికి. అతనిమీద కోపంతో రగిలిపోతూ, విచక్షణా జ్ఞానం పోగొట్టుకుంది. ఆమె ఓ నిర్ణయానికి వచ్చి అతనికి బుద్ధి చెప్పాలని, దానికి ఏం చెయ్యాలో ఆలోచించే లోపల ... కాగల కార్యం గంధర్వులే తీర్చారు.

✳ ✳ ✳

దీనికిముందు, వారం రోజుల క్రిందట ... ధనిక వర్గం లేడీస్ కిట్టీపార్టీలో సుస్మిత ప్రాణస్నేహితురాలు కాంచన, స్నేహితురాలిని ఓ మూలకి లాక్కెళ్ళి ... "ఏమిటి, నువ్వు మీ ఆయన రాసలీలలు తెలిసే ఊరుకున్నావా, తెలియదా అసలు"? గుసగుసలాడింది. "నీకు ఎలా చెప్పాలో, ఎలా అడగాలో తెలియక వారం రోజులుగా మథనపడుతున్నాను. ఫోన్ చేద్దామనుకున్నాను కానీ, ఫోనులో సంభాషణ ఎవరన్నా వింటారేమోననిపించి, కలిసి మాట్లాడాలనుకున్నాను" అంటూ ఆరంభించింది.

**(సశేషం)**

❖❖❖❖❖

# "నవ్వు, నవ్వించు..."

వెబ్ సేకరణ,కూర్పు- శ్రీ సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి, సిడ్నీ



మాటకన్నా ముందుగా 'మందహాసంతో పలకరించడం శ్రీరాముడి వ్యక్తిత్వానికి వన్నె తెచ్చింది". శ్రీరాముడు స్మిత పూర్వభాషి అంది రామాయణం. 'అలతి అలతి నవ్వులార బోసిన కంటివెలుగ వెన్నెల'లను శబరిపై ప్రసరింపజేశాడు శ్రీరాముడు అని శ్రీమద్రామాయణ కల్పవృక్షం పేర్కొంది.

శ్రీకృష్ణుడు నల్లనివాడు.. పద్మనయనాల వాడు మాత్రమే కాదు 'నవ్వు రాజిల్లెడు మోమువాడు' అని వర్ణించింది భాగవతం. నవ్వు లేదా మందహాసం లేదా దరహాసం(Smile) ఒక విధమైన ముఖ కవళిక. నవ్వు మనం నేర్చుకోనక్కర్లేని భాష. పుట్టుకతోనే అబ్బుతుంది. మరో విశేషం ఏమంటే అది మనకు తెలియకుండానే వస్తుంది. వచ్చినప్పుడు నవ్వును బలవంతంగా మనం ఆపగలమే కానీ... బలవంతంగా నవ్వలేం. నవ్వే అవకాశం మనిషికి మాత్రమే ఉంది. మానవులలో నవ్వు సంతోషం, ఆనందానికి బాహ్య సంకేతం. కొందరు నిశ్శబ్దంగా నవ్వుకుంటే, కొంత మంది బయటకు శబ్దం వచ్చేటట్లుగా నవ్వుతారు.

నవ్వు అందరికీ అర్థమయ్యే భాష. పసిపాప నవ్వుతో కనెక్ట్ కానివారెవ్వరూ ఉండరు. జీవితంలో సహజాతమైన అద్భుతం నవ్వు. నవ్వును మించిన సౌందర్యం ఉండదు.

నవరసాలలో మన ఆరోగ్యాన్నిచ్చేది మాత్రం హాస్యరసమే. అలాంటి హాస్యం (నవ్వు) మన జీవితంలో కీలకపాత్ర పోషిస్తుందని వైద్యులు, మానసిక నిపుణులు తరచుగా చెబుతూనే ఉంటారు. చిన్నతనంలో ఏ కల్మషం లేకుండా ఎలాగైతే నవ్వుతుంటామో పెరిగి పెద్దయ్యాక ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నప్పటికీ మనస్ఫూర్తిగా నవ్వుతుంటే మన ఆయుష్షుపై మంచి ప్రభావం ఉంటుంది. నిత్యం మనం ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించే మంచి మెడిసిన్ నవ్వు.

మానవునికి శారీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యాన్ని ఇచ్చి, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేలా చేసేది నవ్వు. సమస్త జీవరాశులలో మానవునికి మాత్రమే నవ్వే యోగం ఉంది. దీన్ని సద్వినియోగం చేసుకోవడం మన కర్తవ్యం. "నరుడు తప్పిస్తే నవ్వగలిగిన జీవి ఈ లోకంలోనే లేదు' అన్నారు కవికోకిల జాషువా.

"నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్ దివ్వెలు" అని తేల్చారాయన. నవ్వు ముఖానికి విశేష అలంకారాన్నిస్తుంది. 'నవ్వులు నవ్యభావ రచనాంచల సీమలో వెన్నెల లల్' అనేది కవుల తీర్మానం.

నవ్వులో రకాలు..

చిరునవ్వు లేదా మందహాసం, విరగబడి నవ్వడం, వికటాట్టహాసం, పకపక నవ్వడం, వెకిలి నవ్వు, ముసిముసి నవ్వు, చిద్విలాసం, బోసినవ్వు లాంటివి ఉంటాయి. కానీ, ఆంధ్ర మహాభారతంలో తిక్కన నవ్వుల గురించి 32 రకాల నవ్వుల గురించి చెప్పారు. పిన్ననవ్వు, అలతినవ్వు, చిరునవ్వు, లేతనవ్వు, కలకల నవ్వు, కఠిన నవ్వు, ప్రౌఢస్మితము, అపహాస్యం లాంటివి చెప్పారు.

అందుకే మనస్ఫూర్తిగా నవ్వే వ్యక్తులు ఎక్కువ కాలం జీవిస్తారు. జీవితంలో ఎన్నడూ నవ్వని వాళ్లు సరాసరి 72.9 ఏళ్ళు, బిగ్గరగా నవ్వేవాళ్లు 79.9 జీవించినట్లు పరిశోధనలలో తేలింది.

మన ప్రాచీనులు నవ్వు ఆరు రకాలుగా విభజించారు. 1.స్మితం 2.హాసితం 3.విహాసితం 4.అవహాసితం, 5.అపహాసితం 6.అతిహాసితం. దూషణ లక్ష్యంగా పెట్టుకొని, మర్యాద మరువక, శ్రుతిమించనీయక చేసే హాస్యమే నిజమైన హాస్యం. కానీ ఎదుటివారిని హేళన చేస్తూ నవ్వడం మంచిది కాదు. వికటాట్టహాసం, వక్రపు నవ్వు, ఎదుటివారి అపజయానికి ఎద్దేవాగా నవ్వడం లాంటి నవ్వులు ఆరోగ్యకరమయినవి కావు. ఈ సృష్టిలో పైసా ఖర్చు లేనిది చిరునవ్వు మాత్రమే.

హాస్యానికి దూరమౌతున్నామా...?

దైనందిన జీవితం యాంత్రికంగా మారిపోతున్న నేటి కాలంలో మానసిక ప్రశాంతత కరువు అవుతోంది. పిల్లలకు చదువుతో ఒత్తిడి, పెద్దలకు తమతమ కార్యకలాపాల్లో, విధుల్లో తీవ్ర పని ఒత్తిడి వల్ల ఉల్లాసానికి దూరమవుతున్నారు. జీవితంలో పెరిగే వేగం, ఒత్తిడి, పోటీ, సమస్యలు...ఇంకా అనేక కారణాలు మనిషిని నవ్వుకు దూరం చేస్తున్నాయి. ఈ తరుణంలో మానసిక ఒత్తిడిని అధిగమించి, ప్రశాంతతను పొందాలనే తపన నేడు అన్ని వర్గాల్లో ఉంది. శరీర దృఢత్వానికి వ్యాయామం, నడక వంటివి ఉపకరిస్తే...మానసిక వికాసానికి హాస్యం ఎంతో దోహదపడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిత్యం సంతోషంగా జీవిడం వల్ల ఆయుష్షు కూడా పెరుగుతుందని వారు వివరిస్తున్నారు.

నవ్వుతూ పలుకరించడం నేర్చుకోవాలి...

జీవితం నవ్వుల బాట లో...

నవ్వడం వల్ల సగటున ఏడేళ్ల ఆయుష్షు పెరుగుతుందట. రోజుకు మగవారు ఎనిమిదిసార్లు నవ్వితే ఆడవారు 62 సార్లు నవ్వుతారట. పసిపిల్లలు అంతకంటే ఎక్కువగా నవ్వుతారు. నవ్వు బాధను మరిపిస్తుంది. మనిషి సంతోషానికి, ఆనందానికి సహజమైన వ్యక్తీకరణ నవ్వు. నవ్వు అంటే కంటికి శాంతి, చూపునకు వరం. అందుకే 'నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వకపోవడం ఒక రోగం' అన్నారు. మానవుడు తన జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు భగవంతుడు ఇచ్చిన ఔషధ రసాయనం నవ్వు. కోపంలో, మన నుంచి వచ్చే చిరునవ్వు ఎదుటివారిని ఆకర్షింపజేస్తుంది. నవ్వును ప్రేమించి, కోపాన్ని ద్వేషించే మనిషికి ఏ రోగాలూ దరిచేరవు. దేహమే దేవాలయం, జీవుడే దేవుడు. జీవుడు ఎల్లప్పుడూ సంతోషంగా, ఉల్లాసంగా ఉండాలి. అపుడే అతడి దేహం ఓ శక్తి కేంద్రంలా మారుతుంది. విచారంగా ఉండటంవల్ల జీవితం సారరహితంగా ఉంటుంది. ప్రతి మనిషి ఎక్కడ పుట్టినా, మరెక్కడ పెరిగినా అర్థమయ్యే భాష నవ్వు. బహుశా ప్రతి ఒక్కరి నవ్వులోనూ అర్థం కూడా ఒక్కటే. ప్రపంచంలో

ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకుంటే అసలు యుద్ధాలు రానేరావు అంటారు అరిస్టాటిల్. చిరునవ్వుకు ఉన్న బలం అలాంటిది.

మొక్కపాటి నరసింహ శాస్త్రి గారి పేరు చెప్పగానే మనకు గుర్తుకు వచ్చేది "బారిస్టర్ పార్వతీశము" నవల. హాస్య కథ వ్రాయటం కన్నా హాస్య నవల ఆద్యంతము పాఠకులను హాస్య రసములో ఓలలాడించే రచన చేయటము బహు కష్టమైనా

పని. తెలుగు సాహిత్యములో రచయితలలో "హాస్య త్రయము" గా పేరుతెచ్చుకున్న వారు శ్రీ పానుగంటి లక్ష్మీ నరసింహం .శ్రీ చిలకమర్తి లక్ష్మి నరసింహం . శ్రీమొక్కపాటి నరసింహ శాస్త్రిగారు. వీరి కంఠా భరణము,
ఒకడు మాడిన రొట్టె తిని కడుపునొప్పి తెచ్చుకొనగా వైద్యుడాతని కంటికి మందు వేసెను - చమత్కార చంద్రిక అనే చాలా పాత పుస్తకంలోని ఒక జోకు.
'ఆసుపత్రికి దారి చెప్పగలరా?' అంటే 'గలను' అని వెళ్లిపోయాడొకతను. ముళ్లపూడి వారి 'నవ్వితే నవ్వండి'లోని ఒక జోకు. వారీ జోకును మరింత ముందుకు లాగి నవ్విస్తారు.

అట్లు తింటారా?' ప్రశ్న - 'అట్లే కానీ' జవాబు. అది మాటకారితనం.

నవ్వుతో ప్రయోజనాలివి:

- ఒక్కసారి గట్టిగా నవ్వితే శరీరంలోని 108 కండరాలకు శక్తి వస్తుంది.
- నవ్వుతూ జీవించడం ఒక కళ. మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి నవ్వు ఒక దివ్వ ఔషధం.
- నవ్వు ఒక ఆధ్యాత్మిక సద్గుణం, మానసిక రోగాలకు సంజీవని.
- గట్టిగా నవ్వే వారిలో రక్తపీడనం (బీపీ)ని అదుపులో ఉంటుంది. హైబీపీ, ఉబ్బసం, మధుమేహం, మానసిక ఒత్తిడులను నవ్వు అదుపులో ఉంచుతుంది.
- బాగా నవ్వే సమయంలో శరీరం ఆక్సిజన్‌ను బాగా తీసుకుంటుంది. దీనివల్ల ఎలాంటి హృద్రోగాలు రావు.
- నవ్వడం వల్ల శరీరంలో నొప్పుల నివారణకు ఉపయోగపడే ఎండార్ఫిన్‌ను శరీరం విడుదల చేస్తుంది.
- హాయిగా నవ్వే వారికి నరాల బలహీనతలు కూడా దరిచేరవు.
- నవ్వు గుండెపోటును నివారిస్తుంది. థైరాయిడ్, స్కాండిలైటిస్ వంటి సమస్యలను దరిచేరనీయదు.
- ముఖంపై వార్ధక్యపు ఛాయలు, ముడుతలు పడనీయకుండా చిరునవ్వు ముఖాన్ని కాంతివంతంగా ఉంచుతుంది.
- నవ్వు ధ్యానానికి సులభమైన మర్గం. ఎందుకంటే నవ్వేటప్పుడు మరి దేని గురించీ ఆలోచించం.
- కంటికి, పెదవులకు, బుగ్గలకు నవ్వు ఒక ప్రధాన వ్యాయామం.
- నవ్వడం వల్ల శరీరంలోని అనేక కండరాలకు వ్యాయామం లభిస్తుంది. అంటే నడుము, కాళ్లు, చేతులు, మెడ, వీపుభాగాలకు చేసే ఎక్సర్‌సైజు ఒక గట్టి నవ్వువల్ల లభిస్తుంది.
- నవ్వడం వల్ల మెడకు మంచి వ్యాయామం లభిస్తుంది. నరాల బలహీనత పోయి గట్టి పడతాయి. మెడకు బెల్టు వాడే అవసరమే రాదు.
- బాగా నవ్వుతున్నప్పుడు శ్వాస ఎక్కువ సార్లు పీల్చుకొని వదలడం వల్ల శరీరంలోని అనేక మలినాలు కార్బన్‌డయాక్సైడ్ ద్వారా వెళ్లిపోయి, ఛాతీకి సంబంధించిన అనేక వ్యాధులు దూరమవుతాయి.
- నిత్యం నవ్వుతూ ఉండే వారికి జీర్ణశక్తి బాగా పెరుగుతుంది.

'నవ్వు' ఆనందానికి, ఆరోగ్యానికి చాలా మంచిదని గుర్తించడంవల్లే చాలా ఊళ్లలో 'హ్యూమర్ క్లబ్స్' (లాఫింగ్ క్లబ్స్) వెలిశాయి.
వాసనలేని పూవులా, పరిహార ప్రసంగంలేని వాక్యం వ్యర్థమన్నాడు ఒక తెలుగు కవి.
కంటినిండా నిద్ర, కడుపునిండా భోజనం, మనసారా నవ్వడం కరవైన తరుణంలో నవ్వువల్ల కలిగే లాభాలను వివరించాలనే ఉద్దేశంతో 1995 సంవత్సరంలో మార్చి 13న భారతీయ వైద్యుడు డాక్టర్ మదన్ కటారియా తనతో బాటు ఉదయపు నడకలో వచ్చేవారికి కడుపుబ్బ నవ్వించేవారు. క్రమక్రమంగా ప్రపంచ నవ్వుల దినాన్ని సృష్టించారు.

నవ్వుల క్లబ్‌గా ప్రారంభమైన ఈ పండుగ క్రమక్రమంగా 78 దేశాల్లో, 15 వేలకు పైగా నవ్వుల క్లబ్‌లుగా విస్తరించింది. అలా నవ్వుల్ని పంచిన క్రెడిట్ భారతదేశానికి దక్కడం గర్వకారణం. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం జరిపేవారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో జనవరిలో చలి వాతావరణం ఉంటుందని, ఆ తేదీని మార్చాలని డిమాండ్ రావడంతో 'లాఫింగ్ క్లబ్ ఇంటర్నేషనల్' వారు ఈ దినోత్సవాన్ని ఏటా మే మొదటి ఆదివారం జరపాలని నిర్ణయించారు. మొట్టమొదట నవ్వుల దినోత్సవాన్ని 1998 జనవరి 11న ముంబయిలో నిర్వహించారు. దానికి 1200 మంది హాజరయ్యారు, నవ్వడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తెలియజేయడమే ఈ దినోత్సవ నిర్వహణ పరమార్థం. నవ్వుల దినోత్సవాన్ని జరుపుకొనేందుకు ఇపుడు చాలా పట్టణాల్లో, నగరాల్లో లాఫింగ్ క్లబ్‌లు ఉన్నాయి.

ఫ్లోరిడాకు చెందిన వైద్య బృందం 'నవ్వు-మానసిక ఆరోగ్యం' అనే అంశంపై అధ్యయనం చేసింది. వారి అధ్యయనం ప్రకారం, నవ్వు వల్ల మనసు ఉల్లాసపడి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. నవ్వు ద్వారా ఒత్తిడిని జయించవచ్చు. గట్టిగా నవ్వడం వల్ల శరీరానికి ఆక్సిజన్ కూడా బాగా అందుతూ గుండె సంబంధిత రోగాలు దరిచేరవు. నవ్విన సందర్భాల్లో శరీరంలోని 108 కండరాలు ఉత్తేజితమవుతాయి. బీపీ అదుపులో ఉంటుంది. పావుగంట సేపు నవ్వితే శరీరంలోని సుమారు 40 కేలరీలు కరిగిపోతాయి. నొప్పుల నివారణకు తోడ్పడే ఎండార్ఫిన్ నవ్వు ద్వారా లభిస్తుంది. డిప్రెషన్‌లో ఉన్న వాళ్లకు లాఫింగ్ థెరపీ ట్రీట్‌మెంట్ చేస్తే 70 శాతం సత్ఫలితాలు లభిస్తాయి. థైరాయిడ్, మైగ్రెయిన్, స్పాండిలైటిస్ వంటి సమస్యలకు నవ్వుతో పరిష్కారం చూపవచ్చు.

నవ్వువల్ల ఇన్ని ప్రయోజనాలు ఉండటంవల్లే పూర్వకాలంలో రాజుల ఆస్థానంలో విదూషకులు ఉండేవారు. అక్బర్ చక్రవర్తి ఆస్థానంలో బీర్బల్, శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలో తెనాలి రామకృష్ణుడు వంటివారు అందరినీ కడుపుబ్బ నవ్వించేవారు. 1980 దశకం వరకూ రోజూ నవ్వుకుని సంతోషంగా సాగిపోయే జీవితాలు మనకు కనబడేవి. నేటికాలంలో నవ్వేవాళ్ళు తక్కువయ్యారని లాఫింగ్ క్లబ్ నిర్వాహకులు చెబుతున్నారు.

సినీ గేయాల్లో కూడా నవ్వు ప్రముఖ స్థానాన్ని పొందింది. "సిరిమల్లె పువ్వల్లె నవ్వు, చిన్నారి పాపల్లే నవ్వు, చిరకాలం ఉండాలి నీ నవ్వు, చిగురిస్తూ ఉండాలి నీ నవ్వు" అని నవ్వు గొప్పదనాన్ని పాట రూపంలో అక్షరీకరించారు ఆచార్య ఆత్రేయ. అందుకే నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వకపోవడం ఒక రోగం అని చెప్పారు దర్శకులు జంధ్యాల. నవ్వు ముఖానికి పెట్టని ఆభరణం వంటిది. అందుకే ఈ రోజనే కాదు, ప్రతిరోజూ నవ్వాలి. యోగాలో నవ్వు ఒక ప్రక్రియ. నవ్వు నేర్చుకునే విద్యకాదు.

ఎప్పుడు నవ్వకూడదు?

నవ్వకుమీ సభలోపల<br>
నవ్వకుమీ తల్లిదండ్రి నాథుల తోడన్<br>
నవ్వకుమీ పర సతితో<br>
నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ


నవ్వడం విషయంలో మగవాళ్ళకు కూడా కొన్ని నియమాలు ఉన్నాయని పై పద్య భావం.

బోసినవ్వుల తాతగా వాసికెక్కిన నేత మన జాతిపిత గాంధీతో కమ్మని నవ్వుని ఆరాధించింది మన దేశం. ముఖానికి ఎన్ని అలంకారాలు చేసినా, నవ్వు ఒక్కటే లేకపోతే అవన్నీ వెలవెలబోతాయి. "నాలో హాస్య ప్రవృత్తి లేకపోతే నేను ఏనాడో ఆత్మహత్యకు పాల్పడేవాణ్ణి' అన్నారు మహాత్మాగాంధీ.

నవ్వు ప్రపంచ భాష. ఇది ఆనందానికి సూచిక. నవ్వడం ద్వారా విశ్వశాంతిని పెంపొందించవచ్చు. ముఖ్యంగా నవ్వుతూ మాట్లాడేవారి పట్ల ఇతరులు త్వరగా ఆకర్షితులు అవుతారనడంలో సందేహం లేదు. నవరసాల్లో అత్యంత ప్రధానమైనది హాస్యం. 'నవ్వడం మనం నేర్చుకోనక్కరలేని భాష'. పుట్టుకనుంచే మనకు నవ్వు వస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే నవ్వే దివ్యౌషధంలా పనిచేస్తుంది.

తెనాలి రామకృష్ణుడు, పరమానందయ్య శిష్యులు, అక్బర్ బీర్బల్ కథలు మర్చిపోలేని హాస్యాన్ని పంచాయి. సహజంగా నవ్వటం చేతకాకుంటే కనీసం టీవీ కార్యక్రమాలను చూస్తో, కామిక్ పుస్తకాలు చదివి నవ్వడం అలవాటు చేసుకోవాలి. రోజుకి గంట కడుపుబ్బ నవ్వగలిగితే మందుల అవసరం తగ్గుతుందని సూచిస్తున్నారు. మనస్ఫూర్తిగా చిందించే చిన్న చిరునవ్వు మనిషికి రెండక్షరాల ఆయుష్షును పెంచుతుందని పరిశోధనల్లో తేలింది. నవ్వు జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది. జీవితంలో ఆశ, విశ్వాసం అవసరం. హాస్యం ఆ రెంటినీ ఇస్తుంది. అందుకే రోజూ నవ్వండి.. నవ్వించండి.. కానీ నవ్వుల పాలు కాకూడదు.

❖❖❖❖❖








# Kameswari



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are finishing times and Varjyam is start and finish times - Standard or Daylight Savings Time (AEST/AEDT) as applicable in Australia.

## జనవరి 2021

శార్వరి మార్గశీర్ష బ విదియ నుండి పుష్య బ విదియ

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిథి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

**Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆది**<br>R - 16:30 to 18:30 | **31**<br>బ విదియ 3:37<br>మఖ 7:55<br>వర్జ్యం 15:33 వ 17:4 | **3**<br>బ చవితి 13:47<br>ఆశ్లేష 1:46<br>వర్జ్యం 13:35 వ 15:9 | **10**<br>బ ఏకాదశి 0:46<br>బ ద్వాదశి 22:23<br>అనురాధ 16:26<br>వర్జ్యం 21:38 వ 23:7 | **17**<br>శు చవితి 13:34<br>శతభిషం 11:41<br>వర్జ్యం 18:30 వ 20:12 | **24**<br>శు దశమి 2:18<br>కృత్తిక 3:4<br>వర్జ్యం 20:41 వ 22:27 |
| **సోమ**<br>R - 7:30 to 9:30 | **బడి సెలవులు**<br>NSW – 27 Jan<br>VIC - 28 Jan | **4**<br>బ పంచమి 12:36<br>మఖ 1:23<br>వర్జ్యం 9:12 వ 10:46 | **11**<br>బ త్రయోదశి 19:58<br>జ్యేష్ఠ 14:43<br>వర్జ్యం లేదు | **18**<br>శు పంచమి 14:41<br>పూర్వాభాద్ర 13:13<br>వర్జ్యం 23:44 వ 1:29 | **25**<br>శు ఏకాదశి 4:22<br>రోహిణి 5:30<br>వర్జ్యం 11:33 వ 13:17 |
| **మంగళ**<br>R - 15:00 to 16:30 | **సెలవు దినాలు**<br>1 - న్యూ ఇయర్ డే<br>13 - భోగి<br>14 - మకర సంక్రాంతి<br>15 - కనుమ<br>26 - ఆస్ట్రేలియా డే | **5**<br>బ షష్ఠి 11:14<br>పుబ్బ 0:49; ఉత్తర 23:51<br>వర్జ్యం 7:43 వ 9:16 | **12**<br>బ చతుర్దశి 17:47<br>మూల 13:8<br>వర్జ్యం 11:38 వ 13: 8<br>వర్జ్యం 22:15 వ 23:46 | **19**<br>శు షష్ఠి 16:23<br>ఉత్తరాభాద్ర 15:31<br>వర్జ్యం లేదు | **26**<br>శు ద్వాదశి 5:48<br>మృగశిర 7:29<br>వర్జ్యం 16:19 వ 18:0 |
| **బుధ**<br>R - 12:00 to 13:30 | **సిడ్నీ**<br>సూర్య ఉ అ<br>1 5:47 20:09<br>8 5:53 20:09<br>15 5:59 20:08<br>22 6:06 20:06<br>29 6:13 20:02 | **6**<br>బ సప్తమి 9:31<br>హస్త 22:39<br>వర్జ్యం 7:50 వ 9:21 | **13●**<br>బ అమావాస్య 15:53<br>పూర్వాషాఢ 11:55<br>వర్జ్యం 19:36 వ 21:8 | **20**<br>శు సప్తమి 18:40<br>రేవతి18:10<br>వర్జ్యం 4:50 వ 6:37 | **27**<br>శు త్రయోదశి 6:37<br>ఆరుద్ర 8:44<br>వర్జ్యం 21:1 వ 22:40 |
| **లక్ష్మి**<br>R - 13:30 to 15:00 | **మెల్బోర్న్**<br>సూర్య ఉ అ<br>1 6:01 20:45<br>8 6:07 20:45<br>15 6:14 20:43<br>22 6:22 20:40<br>29 6:30 20:35 | **7**<br>బ అష్టమి 7:35<br>చిత్ర 21:22<br>వర్జ్యం 6:14 వ 7:44 | **14**<br>శు పాడ్యమి 14:28<br>ఉత్తరాషాఢ 10:58<br>వర్జ్యం 14:54 వ 16:28 | **21**<br>శు అష్టమి 21:14<br>అశ్విని 21:7<br>వర్జ్యం 16:37 వ 18:25 | **28**<br>శు చతుర్దశి 6:41<br>పునర్వసు 9:19<br>వర్జ్యం 17:21 వ 18:57 |
| **శుక్ర**<br>R - 10:30 to 12:00 | **1** మార్గశిరం<br>బ విదియ 14:58<br>పునర్వసు 1:17<br>వర్జ్యం 9:27 వ 11:5 | **8**<br>బ నవమి 5:29<br>స్వాతి 19:47<br>వర్జ్యం 2:36 వ 4:6 | **15**<br>శు విదియ 13:27<br>శ్రవణం 10:32<br>వర్జ్యం 14:35 వ 16:12 | **22**<br>శు నవమి 23:51<br>భరణి పూర్తి<br>వర్జ్యం 7:58 వ 9:46 | **29●**<br>శు పూర్ణిమ 6:10<br>పుష్యమి 9:24<br>వర్జ్యం 21:55 వ 23:29 |
| **శని**<br>R - 09:00 to 10:30 | **2**<br>బ తదియ 14:33<br>పుష్యమి 1:47<br>వర్జ్యం 14:34 వ 16:10 | **9**<br>బ దశమి 3:7<br>విశాఖ 18:5<br>వర్జ్యం 0:59 వ 2:28<br>వర్జ్యం 21:48 వ 23:18 | **16**<br>శు తదియ 13:8<br>ధనిష్ఠ 10:50<br>వర్జ్యం 18:17 వ 19:57 | **23**<br>శు దశమి పూర్తి<br>భరణి 0:14<br>వర్జ్యం 13:39 వ 15:26 | **30** పుష్యం<br>బ పాడ్యమి 5:9<br>ఆశ్లేష 8:52<br>వర్జ్యం 20:24 వ 21:56 |

bindu trikona vasu kona dasara yugmam manvasra naga dala shodasa patrayuktam |
vruttatrayam cha dharani sadanatrayam cha sri chakra raja vudithaha para devathayaha ||

## పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: అమరశిల్పి జక్కన్న

సంగీతం: శ్రీ సాలూరి రాజేశ్వర రావు

గీతరచయిత: శ్రీ సి. నారాయణ రెడ్డి

నేపధ్య గానం: ఘంటసాల

పల్లవి:

ఈ నల్లని రాలలో

ఏ కన్నులు దాగెనో

ఈ బండల మాటునా

ఏ గుండెలు మ్రోగెనో ||| ఈ నల్లని రాలలో |||

చరణం 1:

పాపాలకు తాపాలకు

బహుదూరములో నున్నవి || 2 ||

మునులవోలె కారడవుల

మూలలందు పడియున్నవి ||| ఈ నల్లని రాలలో |||

చరణం 2:

కదలలేవు మెదలలేవు

పదవి విప్పి పలుకలేవు || 2 ||

ఉలి అలికిడి విన్నంతనె

జలజలమని పొంగిపొరలు ||| ఈ నల్లని రాలలో |||

చరణం 3:

పైన కఠినమనిపించును

లోన వెన్న కనిపించును || 2 ||

జీవమున్న మనిషికన్న

శిలలే నయమనిపించును ||| ఈ నల్లని రాలలో |||

https://www.youtube.com/watch?v=lDdy981zs0g

❖❖❖❖❖

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

## INDAUS IMMIGRATION

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***


Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by DSLRCREW


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

❖❖❖❖❖



## బాలవాహిని

డా॥ మీగడ రామలింగస్వామి — సేవాదిత్యులు

### 17. వివేకానంద స్వామి
(నరేంద్రనాథ్ దత్తా)



*అద్భుత జ్ఞాపకశక్తికి*
*వాగ్వైభవ రీతికి*
*రూపానికి గుణాలకు*
*నరేంద్రుడే ప్రతీక!*
*స్వామి వివేకానంద వందనం!*
*ఆశావందన చందనం!*

- ★ జననం :- 1863 జనవరి 12, కలకత్తా.
- ★ భారతేతిహాసాలతో పాటు బహుమతాల, బహుభాషల, సంగీత సాహిత్య నాటకాదులలో అనర్గళ పాండిత్యం.
- ★ సంగీతంపై పరిశోధన గ్రంథం రాశారు.
- ★ 1881 రామకృష్ణ పరమహంస శిష్యుడై ఆధ్యాత్మిక జీవితానికి జీవితం అంకితం చేశారు.
- ★ 'ఎన్సైక్లోపీడియా బ్రిటానికా' 25 సంపుటాల్లో 10 సంపుటాల్లో వారు చదివినది, ఏ పేజీలో అడిగినా చెప్పేవారట. జ్ఞాపకశక్తికిది తార్కాణం.
- ★ వారి ఉపన్యాసాలు వందల సంవత్సరాలకు ప్రబోధాలు.
- ★ వారి రచనలు, రాజయోగ, కర్మయోగ, భక్తియోగ, జ్ఞానయోగ, మై మాస్టర్, ఉపన్యాసాలు చాలా ఉన్నాయి.
- ★ 1893 మే 31 జపాన్, చైనా, కెనడా, యు.కె. పర్యటన.
- ★ యు.ఎస్. 1893 జూలై 30 సర్వమత సభల కోసం వెళ్ళారు.
- ★ 1893 సెప్టెంబరు 11న చికాగోలో ఉపన్యాసం.
- ★ 1897 రామకృష్ణ మిషన్ కలకత్తాలో స్థాపించారు.
- ★ 1902 జూలై 4 తెల్లవారుఝామున 3 గంటలు మెడిటేషన్ చేసుకొని శిష్యులకు శుక్లయజుర్వేదం, సంస్కృత వ్యాకరణం పాఠం చెప్పి వెళ్ళి, ఉదయం గం॥ 9-20 ని॥లకు తన గదిలో బేలూరి మఠంలో సమాధిలోనికి వెళ్ళారు.
- ★ నిర్యాణం :- 1902 జూలై 4, బేలూరి మఠం.



**సూక్తి :- అహము వీడిన అంతయు హస్తగతమె!**

❖❖❖❖❖


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au

❖❖❖❖❖